
# గీటురాయి

సహజీవన భావనల పావురాయి

వారపత్రిక 26-6-2026 ₹ 15/-



## శాంతించారా!






సహజీవన భావాల సౌధీరాయి

# గీటురాయి

వారపత్రిక

## GEETURAI WEEKLY

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in

**Our Bank A/c Details:**
Geeturai Weekly, A/c No.1042789768
IFSC : CBIN0282407, Central Bank of India
Noor Khan Bazar Branch, Hyderabad

సంపుటి: 48 సంచిక: 26 హైదరాబాద్
శుక్రవారం 26 జూన్ 2026 రూ.15-00
ముహర్రమ్ 10 1448 హిజ్రీ


**తొలిగీటు**

ఎవరయితే (గత్యంతరంలేని స్థితిలో తప్ప) సంపదను పోగేసుకోడానికి ఇతరులను యాచిస్తాడో అతడు తన కోసం నరకాన్ని కోరుకుంటున్నాడు.

*బుఖారీ ముస్లిం గ్రంథం*


**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

**గ్రాఫిక్స్**
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

**సర్క్యులేషన్ మేనేజర్**
**అబ్దుల్ జలీల్, 9704317015**



Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**


16 **కథ**



**ప్రేమతీరం**

## లోపల...


| | | |
|---|---|---|
| ఫిరాయింపులు | ...... | 04 |
| శాంతించారా? | ...... | 05 |
| ముస్లిం సమాజం విద్యా ప్రయాణం, సవాళ్ళు – 1 | ...... | 08 |
| వానొచ్చె... జాగ్రత్త సుమా! | ...... | 12 |
| చిరునవ్వు జీవితాన్ని గెలిచే దివ్యౌషధం | ...... | 13 |
| రేపటి వెలుగుల కోసం ఈ ఉదయమే మేల్కొందాం! | ...... | 14 |
| వెలుగుబాట (తఫ్హీముల్ ఖుర్ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు (సహీహ్ బుఖారీ అనువాదం) | ...... | 19 |
| వ్యక్తిగత స్వేచ్ఛ రాజ్యాంగ హక్కుల పరీక్ష | ...... | 20 |
| ప్రకృతి చాలా ఇస్తుంది.... మరి మీరు? | ...... | 22 |
| హిజ్రీ క్యాలెండర్.... | ...... | 24 |
| సైన్స్ ప్రగతి – నాలుగు ప్రధాన ప్రభావాలు–2 | ...... | 28 |
| కర్బలా మహా సంగ్రామం | ...... | 30 |
| సంక్షిప్త భారతం | ...... | 32 |
| సర్వత్రా | ...... | 33 |


## విద్యా వ్యాపారం




విద్య పేర వ్యాపారం
విద్యార్థి వీపుమోత
ప్రైవేటు చదువులు
ప్రజల జేబుకు కోత!

ఎల్ కేజీ యూకేజీకి
వేలు, లక్షలలో ఫీజు
కార్పొరేటు జాలమిది
దుల్పుతున్న బూజు!!

**– యం.డి. ఉస్మాన్ ఖాన్**

# ఆలోచన

## ఫిరాయింపులు

**పశ్చిమ బెంగాల్** ఎన్నికల తర్వాతి రాజకీయ పరిణామాలు దేశ ప్రజాస్వామ్యాన్ని ఏ మలుపు తిప్పుతున్నాయి? ఈ ప్రశ్న ఇప్పుడు అందరు ఆలోచించవలసిన ప్రశ్న. అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ గెలిచింది. తృణమూల్ కాంగ్రెస్ ఓడిపోయింది. ఆ తర్వాత తృణమూల్ కాంగ్రెస్ కుప్పకూలు తున్న సంకేతాలు వస్తున్నాయి. తృణమూల్ పార్టీ గుర్తుపై అసెంబ్లీకి ఎన్నికైన 80 మంది ఎమ్మెల్యేలలో 65 మంది మద్దతు తనకు ఉందని తృణమూల్ తిరుగుబాటు నేత రీతబ్రత బెనర్జీ ప్రకటించాడు. ఈ సంక్షోభం పార్లమెంటుకు కూడా పాకింది. లోక్‌సభలోని 28 మంది తృణమూల్ ఎంపీలలో 20 మంది పార్టీ ఫిరాయించారు. ఏ పార్టీలో చేరారంటే, త్రిపురలో ఊరుపేరు లేని పార్టీలో చేరుతున్నారని వార్త వచ్చింది. ఈ పార్టీ బీజేపీకి సన్నిహితం అని వేరే చెప్ప నవసరం లేదు. 10 మంది టీఎంసీ రాజ్యసభ ఎంపీలలో ముగ్గురు పార్టీకి, ఎగువ సభకు రాజీనామా చేశారు. పార్టీ ఫిరాయింపులు దేశంలో కొత్త కాదు. ఇప్పుడు బెంగాల్‌లో జరుగుతున్నది కేవలం పార్టీ ఫిరాయింపు కాదు. ఇక్కడ లక్ష్యం మొత్తం పార్టీ రాజకీయ ఉనికిని దెబ్బతీయడం. అసెంబ్లీలో ప్రతిపక్షం లేకుండా చేయడం. ఈ ఫిరాయింపు నేతలు తృణమూల్ నుండి బయటకు వెళ్లడం లేదు. పార్టీనే కబ్జా చేసుకుంటున్నారు. తృణమూల్ ఒక కుటుంబ పాలనగా అవినీతిమయమైన పార్టీగా మారిపోయిందనే వాదనలోను బలం లేదు. అలాంటి పార్టీలో ఇంతకాలం ఎందుకు ఉన్నా రనే ప్రశ్నకు వారి వద్ద సమాధానం లేదు.

ఈ పార్టీ కబళింపు రాజకీయాలకు మహారాష్ట్ర ప్రారంభ ప్రయోగశాల. శివసేన, ఆ తర్వాత నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీలు ఇలాగే ముక్కలు చెక్కలయ్యాయి. తమదే అసలైన పార్టీ అని ప్రకటించిన ఫిరాయింపుదారులు బీజేపీ నేతృత్వం లోని అధికార పక్షంతో చేతులు కలిపారు. బెంగాల్లోను ఇదే జరుగుతోంది. దేశంలోని పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ఈ ప్రయత్నాలను అడ్డుకోగలదా? ఈ చట్టం సంఖ్యాపరమైన పరిమితులకు ప్రాధాన్యత ఇస్తుంది: కనీసం మూడింట రెండు వంతుల సభ్యులు వేరొక పార్టీలో విలీనం కావడానికి అంగీక రిస్తే, వారు అనర్హత వేటుకు గురికారు. అంటే ఒకరిద్దరు నేతల ఫిరాయింపులకు బదులు మూకుమ్మడి తిరుగుబాటును నిర్వహించేలా ప్రోత్సహిస్తుంది. ఇది బెంగాల్ ను దాటి విస్తరించే అవకాశాలు కూడా ఉన్నాయి. ఈ విధంగా అధికార పార్టీ పార్లమెంటరీ సంఖ్యాబలం కూడా పెరుగుతుంది. రాజ్యాంగ సవరణలు సులభమవుతాయి. ప్రభుత్వం ఎలాంటి ప్రతిఘటన లేకుండా తన విధానాలను అమలు చేయడానికి ఇది సహాయపడుతుంది. దీనివల్ల తమ మద్దతుదారులను రక్షించుకోవడం, తమ నెట్‌వర్క్‌లకు నిధులు సమకూర్చడం, స్థానిక పరిపాలనను ప్రభావితం చేయడం, అనుకూలమైన మీడియా వాతావరణాన్ని కొనసాగించడం ప్రతిపక్షాలకు కష్టమవుతుంది.

దీర్ఘకాలంలో ఈ పరిణామాలు ఎలాంటి పరిస్థితులకు దారి తీస్తాయంటే, ప్రాంతీయ పార్టీలు క్రమంగా పతనమవు తాయి. తృణమూల్‌కు ఓటమిని తట్టుకుని నిలబడగలిగే ఒక బలమైన, శాశ్వత సంస్థాగత వ్యవస్థ లేదు. ఇదే పరిస్థితి ఇతర ప్రాంతీయ పార్టీలకు కూడా ఎదురు కావచ్చు. ఇప్పుడు ప్రశ్న ప్రతిపక్ష పార్టీలు ఎన్నికల్లో గెలవగలవా అన్నది కాదు. ఓడిపోయిన తర్వాత అవి మనుగడ సాగించగలవా అన్నదే అసలు ప్రశ్న. సైద్ధాంతిక స్పష్టత, అంతర్గత సంస్థాగత వ్యవ స్థలు, క్షేత్రస్థాయి బలం లేనప్పుడు, ఎన్నికల ఓటమి తర్వాత విచ్ఛిన్నం, అధికార పక్షంలో విలీనం అనే క్రమం కొనసాగు తుంది. చివరకు కాంగ్రెస్ తప్ప మరో ప్రత్యామ్నాయం లేని వాతావరణం ఏర్పడవచ్చు.

అబ్దుల్ వాహెద్




**ఈరాన్ అమెరికాల** మధ్య శాంతి ఒప్పందానికి సంబంధించి ముందడుగు పడింది. తెలియవచ్చిన వివరాల ప్రకారం ఈరాన్ యురేనియం నిల్వల విషయంలో కాస్త మెతకవైఖరి చూపించింది. ఈరాన్‌పై అమెరికా ఆంక్షలను ఎత్తేస్తుందని కూడా తెలుస్తోంది. ఈ పరిణామాల తర్వాత ఈరాన్, అమెరికాల మధ్య యుద్ధం శాంతించినట్లే కనిపిస్తోంది. ఈరాన్ అణు కార్యక్రమంపై మరో రెండు నెలల్లో చర్చలు ప్రారంభమవుతాయి. అమెరికా దాడులను తిరిగి ప్రారంభిస్తుందా అన్నది ఇంకా అనుమానాస్పదమే. ఈ ఒప్పందం ఈరాన్ కు అనుకూలంగా ఉందన్నది స్పష్టంగా కనిపిస్తున్న అంశం. ఈరాన్ చమురును స్వేచ్ఛగా అమ్ముకోవడానికి అమెరికా అంగీకరించడం, భవిష్యత్తులో అన్ని ఆంక్షలను ఎత్తివేస్తామని ఆఫర్ చేయడం ఈరాన్ సాధించిన విజయాలు. ఒబామా ఈరాన్‌తో చేసుకున్న ఒప్పందాన్ని విమర్శించిన ట్రంప్ ఇప్పుడు చేసుకున్న ఒప్పందంపై చాలా విమర్శలు వస్తున్నాయి. ఒబామా కాలం నాటి ఈరాన్ అణు ఒప్పందం ప్రకారం, ఆర్థిక ఆంక్షలు తొలగిస్తే ప్రతిగా ఈరాన్ తన అణు కార్యక్రమంపై పరిమితులకు అంగీకరించింది. అణ్వాయుధాలు తయారు చేసేది లేదని కూడా హామీ ఇచ్చింది. ఈరాన్ చమురు ఎగుమతి ఆదాయం 2024లో 46 బిలియన్ డాలర్ల కంటే ఎక్కువగా ఉంది. ఈరాన్ ఆయుధ కార్యక్రమాలు, మానవ హక్కుల ఉల్లంఘనలపై విధించిన ఆంక్షలతో సహా ఈరాన్ ఎదుర్కొంటున్న అన్ని ఆంక్షలను ముగించడానికి ఈ తాత్కాలిక ఒప్పందం మార్గం సుగమం చేస్తుంది, పునర్నిర్మాణం కోసం ఈరాన్‌కు కనీసం 300 బిలియన్ డాలర్లు లభిస్తాయి. ఇది కూడా గమనార్హమైన విషయం. ఈ ఒప్పందం తర్వాత హోర్మూజ్ జలసంధి తెరుచుకుంటుంది. కాబట్టి ప్రపంచ చమురు మార్కెటు కాస్త ఉపశమనం పొందుతుంది

ఈ ఒప్పందం తర్వాత అమెరికన్ పత్రికలు ఏం రాశాయన్నది పరిశీలించడం అవసరం. అమెరికన్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీలను ఉటంకిస్తూ సిఎన్ఎన్ వార్తా సంస్థ “ఈ యుద్ధం తర్వాత ఇరాన్ మరింత శక్తివంతంగా మారింది” అని ఆ చెప్పింది. సిఎన్ఎన్ ఈరాన్‌కు అనుకూలంగా ఈ మాటలు చెప్పలేదు. అమెరికా మీడియా నెతన్యాహు గుప్పిట ఉంది. జియోనిస్ట్ లాబీ చేతుల్లో ఉంది. ఇదేమీ రహస్యం కాదు. ఈరాన్‌తో ట్రంప్ ఒప్పందాన్ని అమెరికాలో చాలా మంది విమర్శిస్తున్నారు. మార్కో రూబియో పేరు కూడా చాలా వినిపిస్తోంది. ఇప్పుడు ఈ వార్తాసంస్థ ప్రకారం పరిస్థితి ఏమిటంటే, ఈరాన్ చాలా బలపడింది. భవిష్యత్తులో ఎప్పుడైనా హోర్ముజ్ జలసంధిని ఈరాన్ మూసేయగలదు. ఈ పరిస్థితిని కొనితెచ్చుకున్నది అమెరికాయే. ఈరాన్ అణుబాంబు తయారీ విషయంలో అమెరికా మాటను లక్ష్యపెట్టదని, ఎప్పుడైనా అణుబాంబు తయారు చేసుకుంటుందని భయపడుతున్నారు. అలాగే యెమెన్ హూతీ మిలిషియా సహాయంతో ఎప్పుడైనా సరే బాబ్–అల్–మందేబ్ జలసంధిని కూడా మూయించగలదు. కాబట్టి ఈ ఒప్పందాన్ని రద్దు చేసుకుని యుద్ధం మొదలెట్టాలని అమెరికా జియోనిస్టు లాబీ కోరుతోంది. ట్రంప్‌పై ఒత్తిడి తెస్తున్నారు. నెతన్యాహు మనసులో మాట కూడా ఇదే. నెతన్యాహు ఈ ఒప్పందాన్ని ఎలాగైనా చెడగొట్టాలని, అమెరికన్ ఏజెన్సీలలో ఉన్న తన మనుషుల ద్వారా ఒత్తిడి తెస్తున్నాడు. ఈ ఒప్పందం కుదరడంలో కీలకపాత్ర

పోషించినవాడు జేడీ వాన్స్. అతను మొదటి నుంచీ ఈ యుద్ధానికి వ్యతిరేకం. నెతన్యాహు కోసం పనిచేసే జారెడ్ కుష్నర్, స్టీవ్ విట్‌కాఫ్ లాంటి వారెవరూ ఈ ఒప్పందంపై సంతకం చేసే సమయంలో ఎక్కడా కనిపించలేదు. ట్రంప్ ఒక విషయం బాగా అర్థం చేసు కున్నాడు. ఒప్పందం కుదరాలంటే నెతన్యాహు మనుషుల మీద కాకుండా, నిజంగా అమెరికా ప్రయోజనాలు కోరుకునే వారిని మాత్రమే నమ్మాలని తెలుసుకున్నాడు. అందుకే జె.డి. వాన్స్‌ను నమ్మాడు, ఈరాన్ కూడా అంగీకరించింది. కుష్నర్, విట్‌కాఫ్‌లతో మాట్లాడ్డం కూడా ఈరాన్‌కు ఇష్టం లేదు. అయితే ఈ యుద్ధం తర్వాత ఈరాన్ బలపడిందన్నది నిజం.

రాయిటర్స్ వార్తాసంస్థ ప్రకారం ఈరాన్‌కు 300 బిలియన్ డాలర్ల నష్ట పరిహారం లభిస్తోంది. ఈ సొమ్ము ఈరాన్ పురోభివృద్ధికి తోడ్పడు తుంది. ఈ 300 బిలియన్ల డాలర్లలో సగం అంటే 150 బిలియన్ డాలర్లు ఇప్పటికే ఈరాన్‌కు ఇచ్చారని రాయిటర్స్ చెబుతోంది. పరిహారం ఇచ్చామని చెబితే ఓటమిని అంగీకరించినట్లు అవుతుంది కాబట్టి, పరువు కాపాడుకోవడానికి దీనిని నేరుగా పరిహారం అనకుండా "పునర్నిర్మాణ అభివృద్ధి నిధి" (Reconstruction and Development Fund) అని పేరు పెట్టారు. పేరేం పెట్టుకున్నా ఇది ఈరాన్ కు అమెరికా చెల్లించడానికి ఒప్పుకున్న మొత్తం. ఇప్పటికే 150 బిలియన్లు ఇచ్చారంటే ఆ ఫండ్ ఏర్పాటైపోయింది. యుద్ధంలో ధ్వంసమైన భవనాలు, యూనివర్సిటీలను పునర్నిర్మించడానికి, చనిపోయిన వారి కుటుంబాలకు పరిహారం ఇవ్వడానికి, వంతెనలు, ఫ్యాక్టరీలు లాంటి కొత్త పనుల అభివృద్ధికి దీనిని వాడతారు. ఆయు ధాలు కొనడానికి తప్ప దేనికైనా వాడుకోవచ్చు. ఇది అమెరికా ఓటమికి సంకేతం. అయితే ఈ 300 బిలియన్ డాలర్లు అమెరికా తన ఖజానా నుంచి ఇవ్వదు. అరబ్బు దేశాల నెత్తిన రుద్దుతుంది.

అల్ అరేబియా ఛానెల్ ఈ ఒప్పందానికి సంబంధించిన 14-పాయింట్ల ముసాయిదాను వివరంగా ప్రచురించింది. ఇందులో రెండు ముఖ్యమైన విషయాలున్నాయి. మొదటిది స్తంభింపజేసిన ఈరాన్ ఆస్తులను (Frozen assets) విడుదల చేయడం. రెండవది యుద్ధ ముగింపు అనేది అన్ని ప్రాంతాలకు వర్తిస్తుంది. ఈ ఒప్పందం ఒకవైపు అమెరికా, దాని మిత్రదేశాలు (ఇస్రాయీల్) మరోవైపు ఈరాన్ దాని మిత్ర పక్షాలు (హిజ్బుల్లా, హూతీ, హమాస్, ఇరాక్ లోని చిన్న గ్రూపులు) మధ్య జరిగింది. దీని అర్థం ఏమిటంటే, లెబనాన్, హమాస్ లేదా హూతీలపై ఏ దాడి జరిగినా అది ఈరాన్‌పై దాడిగా పరిగణిస్తారు, ఒప్పంద ఉల్లంఘనగా భావించి ఇస్రాయీల్‌పై దాడి చేసే పూర్తి హక్కు ఈరాన్‌కు లభిస్తుంది. ఒప్పందాన్ని పరిశీలిస్తే ఇది పూర్తిగా ఈరాన్ సాధించిన విజయం అని అర్థమవుతుంది.

కెనడా ప్రధాని మార్క్ కార్నీ ఈ 14-పాయింట్ల ముసాయిదాను చూసి, "ఇది చాలా మంచి ఒప్పందం, దీనివల్ల ఈరాన్ ఇక ఎప్పుడూ అణుబాంబులు తయారు చేయలేదు" అని ప్రకటించారు. నెతన్యాహు, అమెరికా కూడా ఇదే మాట పదే పదే చెబుతున్నాయి. కాని ఆలో చించవలసిన విషయమేమిటంటే, అణుబాంబు తయారు చేస్తామని ఈరాన్ ఎప్పుడైనా చెప్పిందా? అణుబాంబుల విషయంలో ఈరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా ఖమేనాయి ఎప్పుడో ఒక ఫత్వా జారీ చేశారు:"అణుబాంబులు ఇస్లాంకు వ్యతిరేకం, ఒకేసారి ఇంతమందిని చంపే ఆయుధాన్ని మేం తయారు చేయము" అని స్పష్టంగా ఆయన జారీ చేసిన ఫత్వా ఉంది. ఈరాన్ అణుబాంబు ఇంతవరకు తయారు చేయకుండా ఉండడానికి ప్రధానకారణం ఈ ఫత్వాయే అని చెబు తున్నారు. అలాంటప్పుడు ఈరాన్ అణుబాంబు తయారు చేయ కుండా అడ్డుకున్నామని చెప్పుకోవడం హాస్యాస్పదం.

ఉత్తర కొరియా, పాకిస్థాన్ లాంటి దేశాలు అన్ని ఒత్తిళ్లను తట్టుకుని అణుబాంబులు తయారు చేసినప్పుడు, రష్యా, చైనా మద్దతు ఉన్న ఈరాన్ ఈ 40 ఏళ్లలో ఒక అణుబాంబు తయారు చేయడం పెద్ద కష్టమేమీ కాదు. ఈరాన్ అణుబాంబు తయారు చేయకపోవడానికి కారణం వారి సొంత సిద్ధాంతం. కానీ వీళ్ళు అమెరికా, ఇస్రాయీల్ దేశాలు ఇదేదో తాము సాధించిన విజయంగా చెప్పుకుంటున్నాయి. ఇక హార్మూజ్ జలసంధి (Strait of Hormuz) విషయానికి వస్తే, "ఈరాన్‌ను దౌత్యంలో ఎన్నడూ ఓడించలేము" అని ట్రంప్ చెప్పనే చెప్పాడు. ఈరాన్ నాయకులు "అంతర్జాతీయ చట్టాల ప్రకారం మేము టోల్ వసూలు చేయము, కానీ మా సముద్ర జలాల్లో ప్రయాణించే నౌకల భద్రత, సదుపాయాల కోసం మెయింటెనెన్స్ ఫీజు (నిర్వహణ రుసుము) వసూలు చేస్తాం" అంటున్నారు. ఈరాన్, ఒమన్ దేశాలు కలిసి ఈ మెయింటెనెన్స్ ఫీజు వసూలు చేస్తాయి. పేరేదైతేనేం ఇప్పుడు హార్మూజ్ జలసంధి నుంచి రాకపోకలు యుద్ధా నికి ముందు నాటి స్వేచ్ఛా వాతావరణంలో జరగవు. ఈరాన్ కను సన్నల్లో రాకపోకలుంటాయి. ఇది కూడా ఈరాన్ సాధించిన విజయమే.

యుద్ధానికి ముందు ఉన్న ఆంక్షల వల్ల ఈరాన్ కేవలం చైనా లేదా కొన్ని లాటిన్ అమెరికన్ దేశాలకు మాత్రమే చమురును అమ్ముకునేది. ఈ ఒప్పందంతో, ఈరాన్‌పై ఉన్న ఆంక్షలను దశలవారీగా ఎత్తి వేస్తారు. దీనివల్ల ఈరాన్ ప్రపంచ మార్కెట్లో స్వేచ్ఛగా తన చమురును అమ్ముకోగలుగుతుంది, తద్వారా భారీ ఆదాయం వస్తుంది.

ఇస్రాయీల్ ఇన్నాళ్లూ వాడుతున్న ఐరన్ డోమ్ (ఒబామా ఇచ్చింది), థాడ్, పేట్రియాట్ (ట్రంప్ ఇచ్చినవి), యుద్ధ విమానాలు (జర్మనీ, బ్రిటన్, అమెరికా నుండి కొన్నవి) అన్నీ అరువు తెచ్చుకున్నవే. అరువు తెచ్చుకున్న టెక్నాలజీ. కానీ ఈరాన్ ఇస్రాయీల్‌పై వాడిన క్షిపణులు, ఇంటర్‌సెప్టర్లు, డ్రోన్లు వారి సొంత టెక్నాలజీతో దేశీయంగా తయారైనవి. ఎవరూ కూల్చలేరనుకున్న అమెరికాకు చెందిన అధునాతన F35 యుద్ధవిమానాలను, మిలియన్ డాలర్ల ఫైటర్ జెట్లను, ఈరాన్ తన చౌకైన డ్రోన్లతో కూల్చేసింది. ఆంక్షలు తొలగిన తర్వాత, తక్కువ ఖర్చుతో ఇంతటి పవర్ ఫుల్ డ్రోన్లను తయారు చేసిన ఈరాన్ నుండి ఆయుధాలు కొనడానికి ప్రపంచ దేశాలన్నీ క్యూ కడతాయి. త్వరలోనే ఈరాన్ చమురుతో పాటు ఆయుధాల ఎగుమతిలో కూడా ముఖ్యదేశంగా మారుతుంది. ఇది కూడా ఈరాన్ సాధించిన విజయమే. ఈ యుద్ధం తర్వాత అమెరికాకు, ఇస్రాయీల్‌కు ఒక్క పైసా లాభం కలగలేదు.

ఈ ఒప్పదంపై ట్రంప్ సంతకాలు చేసిన తేదీ కూడా గమనించ దగింది. జూన్ 14, 2026న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 80వ సంవత్సరంలోకి అడుగుపెట్టారు. తన 80వ పుట్టినరోజు సందర్భంగా ఆయన ఈరాన్‌తో ఒక పెద్ద ఒప్పందాన్ని ప్రకటించారు. బహుశా ట్రంప్ తన పుట్టినరోజున ఈరాన్‌కు ఒక పెద్ద బహుమతిని ఇవ్వాలని అనుకున్నాడేమో.

ఈ నిర్ణయాన్ని అమెరికాలోని రాజకీయ నాయకులు వ్యతిరేకిస్తు న్నారు. దీనిపై అమెరికా రాజకీయాల్లో తీవ్రమైన చర్చ నడుస్తోంది. ఇస్రాయీల్ ఆగ్రహంతో ఊగిపోతోంది. నెతన్యాహు మండిపడు తున్నాడు. "మేము లెబనాన్ నుండి ఎట్టిపరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గం. మీ ఒప్పందాన్ని మీ దగ్గరే ఉంచుకోండి." అంటున్నాడు

మరోవైపు ట్రంప్ మనసులో ఏది వస్తే అది మాట్లాడే రకం. "అమెరికా లేకుండా ఇస్రాయీల్ మనుగడలేదు." అని ఆయన కుండబద్దలు కొట్టాడు. ట్రంప్ ప్రకటన తర్వాత అమెరికాలోని మైక్ హక్కబీ ఆగ్రహంతో ఊగిపోయాడు. ఈయన ఇస్రాయీల్‌లో అమెరికా రాయబారి, కానీ ఆయన దేశభక్తి అమెరికా పట్ల కాదు, ఇస్రాయీల్ పట్ల ఉంది, అమెరికా రాయబారి అయినప్పటికీ, "ఇస్రాయీల్ లేకుండా అమెరికా లేదు" అని ప్రకటించేశాడు. ఒక సార్వభౌమాధికారం ఉన్న అగ్రరాజ్యం మరో చిన్న దేశానికి ఈ స్థాయిలో ఊడిగం చేయడం బహుశా ప్రపంచ చరిత్రలో ఇదే మొదటిసారి.

అమెరికా లేకుండా ఇస్రాయీల్ ఏర్పడేది కాదు, నేడు మనుగడ సాగించేది కాదు అనేది అందరికీ తెలిసిన వాస్తవం. కాని ఇస్రాయీల్ ఈ సత్యాన్ని ఎప్పటికీ ఒప్పుకోదు. ఇలా ఎవరైనా మాట్లాడితే వాళ్ళ నోరు మూయించడం కూడా ఇస్రాయీల్ చేస్తూ వచ్చింది. రిచర్డ్ నిక్సన్, జాన్ ఎఫ్. కెన్నెడీ, బిల్ క్లింటన్ ... అమెరికా అధ్యక్షుడెవరైనా సరే ఇస్రాయీల్‌కు వ్యతిరేకంగా వ్యవహరిస్తే వెంటనే ఆ అధ్యక్షుడి కెరీర్ లేదా జీవితం, ఏదో ఒకటి ముగిసిపోతుంది. బహుశా అందుకే దశాబ్దాలుగా చాలా మంది అమెరికా అధ్యక్షులు ఇస్రాయీల్‌తో స్నేహాన్ని కొనసాగిస్తూ వచ్చారు. డొనాల్డ్ ట్రంప్ కూడా దీనికి మినహాయింపు కాదు. ట్రంప్ ఇస్రాయీల్‌కు గట్టి మద్దతిచ్చిన నాయకుడే. ఎన్నికల ముందు మాత్రమే కాదు, అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత కూడా ఇస్రాయీల్ పట్ల తన భక్తిని చాటుకోవడానికి ట్రంప్ ఏ అవకాశాన్ని వదల్లేదు.

ఇస్రాయీల్ ఒత్తిడి కారణంగా డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై యుద్ధానికి దిగాడు. అది కూడా అమెరికా–ఈరాన్ మధ్య చర్చలు జరిగి, ఒప్పందం కుదిరే దశలో ఉన్నప్పుడు నెతన్యాహు వచ్చి ట్రంప్‌ను ఈరాన్‌పై దాడికి ఒప్పించాడు. అంతకుముందు నెలలోనే వెనిజులా అధ్యక్షుడిని ఏ అడ్డంకి లేకుండా ఇంటి నుండి పట్టుకొచ్చారు. గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకునే చర్చలు కూడా జరిగాయి. వైట్ హౌస్ ఉత్సాహంగా ఉన్న సమయంలో నెతన్యాహు ఎంట్రీ "ఇచ్చి పనిలో పని, ఈరాన్ పని కూడా పూర్తి చేయండి; అక్కడ ప్రజలు ఇప్పటికే ప్రభుత్వానికి వ్యతిరేకంగా రోడ్లపైకి వచ్చారు, మీరు కేవలం పైనాయకత్వాన్ని తొలగిస్తే చాలు, తిరుగుబాటు దానంతట అదే జరుగుతుంది" అని నమ్మబలికాడు. వైట్ హౌస్ కూడా దీనికి అంగీకరించి "ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ" ప్రారంభించింది.

కానీ కేవలం రెండు వారాల్లోనే ఈరాన్ ప్రతిదాడులతో ట్రంప్, నెతన్యాహులకు వాస్తవాలు బోధపడ్డాయి. మొదటి రోజే ఈరాన్ లొంగిపోతుందని నెతన్యాహు నమ్మబలికాడు. ఇక్కడే నెతన్యాహు మొదటి అబద్ధం బయటపడింది. ఏప్రిల్ మొదటి వారంలోనే అమెరికా–ఈరాన్ మధ్య కాల్పుల విరమణ ప్రకటించినప్పటికీ, ఇస్రాయీల్ లెబనాన్‌లో యుద్ధాన్ని కొనసాగించింది. ఒకట్రెండు సార్లు యుద్ధం మళ్లీ మొదటికొస్తుందేమో అన్నట్లుగా పరిస్థితులు మారాయి. ట్రంప్ నెతన్యాహుతో పదే పదే మాట్లాడి, హెచ్చరించాల్సి వచ్చింది.

అమెరికా బాంబులు, అమెరికా డబ్బు, అమెరికా రక్షణ పొందుతున్న ఇస్రాయీల్ తన ఇష్టానుసారంగా వ్యవహరించడంతో ట్రంప్ విసిగి పోయారు. చివరకు ఒప్పందం కుదిరే రెండు గంటల ముందు వరకు కూడా ఇస్రాయీల్ బీరుట్‌పై దాడులు చేస్తూనే ఉంది. అందుకే సంతకాలు చేయడం ఆలస్యమైంది. ఇక చాలు అని ట్రంప్ నిర్ణ యించుకున్నారు.

గత రెండు వారాలుగా ట్రంప్ తీవ్ర అసంతృప్తితో నెతన్యాహుకు ఫోన్ చేసి తిడుతున్నట్లు వార్తలు వచ్చాయి. ఒప్పందం కుదిరిన తర్వాత ఈ వివాదం బహిరంగంగా మారింది, ఎందుకంటే ఈ ఒప్పందంలో లెబనాన్‌లో శాంతిని ఒక ముఖ్యమైన షరతుగా పెట్టారు. కానీ ఇస్రాయీల్ లెబనాన్ నుండి తప్పుకోవడానికి నిరాక రించింది. తాము స్వతంత్ర దేశమని, అమెరికా మాట వినాల్సిన అవసరం లేదని నెతన్యాహు స్వయంగా ప్రకటించారు. దీంతో ట్రంప్ మరుసటి రోజే G7 సమావేశానికి వెళ్లి నెతన్యాహును తప్పుపట్టాడు. ట్రంప్ ఇస్రాయీల్ అసలు రూపాన్ని ప్రపంచానికి చూపిస్తున్నాడు. ఇది ప్రమాదకరమని, ఆయనపై మళ్లీ హత్యాయత్నం జరిగే అవకాశం ఉందనే చర్చలు నడుస్తున్నాయి. ట్రంప్ తన 80వ పుట్టిన రోజు వేళ, తన ప్రాణాన్ని పణంగా పెట్టయినా అమెరికాను ఇస్రా యీల్ పట్టు నుండి విడిపించాలని అనుకుంటున్నారా? ఎందుకంటే ఇస్రాయీల్ శత్రువైన ఈరాన్‌కు మద్దతు ఇవ్వడం, బిలియన్ల డాలర్లు విడుదల చేయడం, ఆ దేశ నాయకత్వాన్ని ప్రశంసించడం ఇస్రా యీల్ ఎప్పటికీ సహించదు.

ఈరాన్ పవర్ చూసిన తర్వాత ట్రంప్ దానికి గౌరవం ఇవ్వడం ప్రారంభించారు. కానీ దీని వల్ల మధ్యప్రాచ్యంలో ఇస్రాయీల్ వ్యూహా లన్నీ దెబ్బతింటాయి. ఒకవేళ అమెరికా ప్రజలు మేల్కొని, తమ దేశం ఇస్రాయీల్‌కు బానిసగా మారిందని గ్రహించి, రెండవ స్వాతంత్ర్య పోరాటానికి సిద్ధమైతే, డొనాల్డ్ ట్రంప్ పేరు అమెరికా చరిత్రలో గొప్ప అధ్యక్షుల జాబితాలో నిలిచిపోతుంది. మరి అమెరికా ప్రజలు మేల్కొంటారా? ట్రంప్ ఈ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్ల గలరా లేదా అనేది కాలమే సమాధానం చెప్పాలి. ✤




## విజ్ఞాన వారసత్వం

# ముస్లిం సమాజం విద్యా ప్రయాణం, సవాళ్ళు

**యండి. ఉస్మాన్ ఖాన్, సీనియర్ జర్నలిస్ట్**

మానవ జీవితంలో విద్య విజ్ఞానాలకు ఉన్న ప్రాముఖ్యత చాలా గొప్పది. చదువు ద్వారా మానవుడు తన వ్యక్తిత్వాన్ని మెరుగు పరుచుకుంటాడు, తీర్చిదిద్దుకుంటాడు, సమాజంలో విలువల్ని నేర్చుకుంటాడు, శాస్త్ర విజ్ఞానాన్ని సాధిస్తాడు. ఇస్లామ్ ధర్మంలో విద్యకు ఉన్న ప్రాముఖ్యత అంతా ఇంతా కాదు. పవిత్ర ఖుర్ఆన్ అవతరణే ' ఇఖ్రా' (చదువు) అన్న వాక్యంతో ప్రారంభమైంది.

అయితే, ఈ రోజు పరిస్థితిని గమనిస్తే, విద్యారంగంలో ముస్లింల వెనుకబాటు చాలా స్పష్టంగా మనకు కనబడుతుంది. ఇది కేవలం ప్రభుత్వ పాలసీల వల్ల మాత్రమే కాకుండా, మనం విద్యపై చూపే అలసత్వం, అనవసర భయాలు, కొన్నిసార్లు మన ఆధ్యాత్మికతను చదువుకు విరుద్ధమైనదిగా భావించడం కూడా కారణం. ఈ నేపథ్యంలో, ఇస్లాం ధర్మం విద్యను ఎలా ప్రోత్సహించిందో, ముస్లింలు ప్రాచీన కాలంలో ఏ విధంగా విజ్ఞాన క్షేత్రాల్లో అగ్రగాములుగా వెలుగొందారో, ఇప్పటి డిజిటల్ యుగంలో మన బాధ్యతలు ఏమిటో తెలుసుకోవాల్సిన, విశ్లేషించుకోవాల్సిన అవసరం ఉంది.

### ఇస్లాంలో విద్య ప్రాముఖ్యత

ఇస్లాం ధర్మం మనకు విద్య, విశ్లేషణ, పరిశోధన వంటి అంశాల్లో సరైన మార్గదర్శనం అందిస్తుంది. పవిత్ర ఖుర్ఆన్ మొదటి అవతరణే 'చదువు'తో ప్రారంభమైంది. 'మానవుడా! చదువు నీ ప్రభువు పేరుతో..' అంటూ తొలి ప్రకటన చేయడం ద్వారా ఇస్లామ్ విద్యా విజ్ఞానాలకు ద్వారాలు తెరిచింది.

విద్య అంటే కేవలం ధార్మిక విద్య నేర్చుకోవడం మాత్రమే కాదు. అది వ్యక్తిత్వాన్ని, నైతికతను, ధర్మబద్ధతను, సమాజానికి సేవ చేసే తత్వాన్ని నూరిపోయడం. మదర్సాలలో పిల్లలకు ఖురాన్ , హదీసు, అరబీ భాష వంటి అంశాలతోపాటు, సైన్సు, గణితం, ఖగోళం, వైద్యం, తత్వం లాంటి ఆధునిక విద్యనూ బోధించడం. ఇది మానవ నిర్మాణానికి మూలమైన ఒక ఆధునిక ఆధ్యాత్మిక విద్యావిధానం.

ప్రాపంచిక విద్య అంటే ఇప్పుడే కొత్తగా వచ్చిందేంకాదు. ప్రాచీన కాలం నుండీ ఉన్నదే. ముస్లింల ప్రాక్టీసులో కూడా ఉన్నదే. దాన్ని వారు అనేక విధాలా ప్రోత్సహిస్తూ వచ్చారు. కేవలం మతపరమైన విజ్ఞానమే కాకుండా, ఖగోళశాస్త్రం, గణితం, వైద్యం, భౌగోళికం, తత్వశాస్త్రం వంటి ఎన్నో రంగాల్లో ఇస్లామీయ మేధావులు ప్రపంచానికి మార్గనిర్దేశనం చేశారు.

## అల్ బైరూనీ

అల్ బైరూనీ (973 – 1048 CE) విజ్ఞాన శాస్త్ర ఆవిష్కరణకు ఆదిగురువు. ఈయన ఖ్వారెజ్మ్ ప్రాంతానికి చెందిన గొప్ప గణిత, ఖగోళ, భౌగోళిక, ఔషధ, భాషా శాస్త్రవేత్త. పూర్తి పేరు అబూ రైహాన్ అల్ బైరూనీ.

ఖగోళశాస్త్రం, అంకగణితం, ఆయుర్వేదం, తత్వశాస్త్రం వంటి అనేక అంశా లపై పరిశోధనలు చేశాడు.

అల్ బైరూనీ ప్రఖ్యాత రచన: 'తహ్ఖీఖ్ మాలిల్ హింద్..'

(Tahqeeq ma liµl-Hind min Maqoola Maqboola fiµl-»Aql aw Mardhoola)

ఇది భారతీయ విజ్ఞానాన్ని అరబీ భాషలో పరిచయం చేసిన అపురూపమైన, అపూర్వ గ్రంథం.

అంతే కాకుండా, అల్ బైరూనీ 'అల్–ఖానూన్ అల్–మసూదీ' అనే ఖగోళశాస్త్ర గ్రంథం కూడా రచించాడు. ఇదికూడా గొప్ప ప్రసిద్ధి చెందిన గ్రంథం. గణిత శాస్త్రం, ఖగోళ శాస్త్ర రంగాల్లో ఇది అమోఘంగా ఉపయోగపడింది.

అల్ బైరూనీ కేవలం ఒక పరిశోధకుడే కాదు, భిన్న సంస్కృతుల మధ్య విజ్ఞాన వారధిని నిర్మించిన మహోన్నత మేధావి. ఏ విధమైన పక్షపాతం లేకుండా, కేవలం సత్య శోధనే ధ్యేయంగా భారతీయ సమాజాన్ని, ఇక్కడి విజ్ఞానాన్ని ఆయన అధ్యయనం చేశారు. అందుకే ఆయనను ప్రపంచపు 'మొదటి మానవ విజ్ఞాన శాస్త్రవేత్త' (First Anthropologist)గా, 'ఇండోలజీ పితామహుడిగా' (Father of Indology) ఆధునిక ప్రపంచం గౌరవిస్తుంది. ముస్లింలు ఇతర సంస్కృతులలోని మంచిని, విజ్ఞానాన్ని ఏ విధంగా గౌరవించి స్వీకరించాలో చెప్పడానికి అల్ బైరూనీ జీవితం ఒక సజీవ సాక్ష్యం.

## ఇబ్నె రుష్ద్

ఇబ్నె రుష్ద్ :(1126 –1198 CE) ఈయన అంద్రలూసియా (ఇప్పటి స్పెయిన్)కు చెందిన ప్రఖ్యాత తత్వవేత్త, వైద్యుడు, న్యాయవేత్త / ఖాజీ. అరిస్టాటిల్ తత్వ గ్రంథాలను విశ్లేషించి 'తహాఫుత్ అత్తహాఫుత్' అనే గ్రంథం ద్వారా మతం, తత్వశాస్త్రం పరస్పరం విరుద్ధాలు కావని వివరించాడు.

ఈయన రచనలు యూరోపును జ్ఞానం దిశగా నడిపించాయి. అవి మతం, తత్వశాస్త్రం మధ్య సామరస్యాన్ని చర్చకు తెచ్చి, శాస్త్రీయ ఆలోచనకు బలమైన పునాది వేశాయి. మానవ చింతనను తిరిగి తార్కిక దిశలో మలిచే యుగానికి ఆయన ఆలోచనలు దిక్సూచి అయ్యాయి.

యూరప్‌లో అంధకార యుగం (Dark Ages) నడుస్తున్న కాలంలో, ఇబ్నె రుష్ద్ రాసిన తార్కిక విశ్లేషణలు అక్కడ 'అవెరాయిజం' (Averroism) అనే కొత్త ఆలోచనా విధానానికి ఊపిరి పోశాయి. మతాన్ని మూఢత్వంతో కాకుండా హేతు బద్ధతతో, సైంటిఫిక్ కోణంలో ఎలా అర్థం చేసుకోవాలో ఆయన ప్రపంచానికి నేర్పారు. అందుకే ఆధునిక పాశ్చాత్య లోకం ఆయనను 'లౌకికవాద పితామహుడిగా' (Father of Secular Thought) కొనియాడడమే కాకుండా, యూరప్ పునరుజ్జీవనానికి ఆయన ఆలోచనలే పునాది అని అంగీకరిస్తుంది. ముస్లింలు తమ వైజ్ఞానిక వైభవాన్ని తిరిగి సాధించాలంటే సంకుచితత్వాన్ని వీడి, తార్కిక ఆలోచనను మళ్లీ అలవర్చుకోవాలని ఇబ్నె రుష్ద్ జీవితం మనకు స్పష్టం చేస్తోంది.

## జీరో (0) ముస్లిం శాస్త్రవేత్తల విప్లవాత్మక అభివృద్ధి

అల్ ఖ్వారిజ్మీ (Al - Khwarizmi) తన గ్రంథాలలో హిందూ – అరబిక్ సంఖ్యా వ్యవస్థను (Hindu - Arabic numerals) విశ్లేషించి, గణితంలో 'సున్నా'ను (zero) నిర్మాణాత్మకంగా ప్రవేశపెట్టాడు.

ఇది ఆధునిక గణితాన్ని, గణన శాస్త్రాన్ని శాశ్వతంగా మార్చేసిన ఘట్టం. 'అల్జిబ్రా', 'అల్గోరిథం' వంటి పదాలు ఈ శాస్త్రవేత్త పేరిట ప్రసిద్ధయ్యాయి.

అల్ ఖ్వారిజ్మీ కేవలం సున్నాను ఉపయోగించడమే కాకుండా, గణితంలో ఎక్స్‌ప్రెషన్లను సాధించడానికి 'అల్ – జబ్ర్' (Al-Jabr) అనే సరికొత్త విధానాన్ని ప్రవేశపెట్టారు, అదే కాలక్రమేణా 'అల్జిబ్రా' (Algebra)గా మారింది. అలాగే సమస్యలను ఒక

క్రమపద్ధతిలో పరిష్కరించేందుకు ఆయన రూపకల్పన చేసిన గణిత సూత్రాలే నేటి ఆధునిక కంప్యూటర్ సైన్స్‌కు ప్రాణమైన 'అల్గోరిథం' (Algorithm)గా రూపాంతరం చెందాయి. ఒక రకంగా చెప్పాలంటే, నాడు ముస్లిం శాస్త్రవేత్తలు సున్నాను, అల్జీబ్రాను అభివృద్ధి చేసి ఉండకపోతే నేటి డిజిటల్ విప్లవం, సాఫ్ట్‌వేర్ రంగం, చివరికి మనం వాడుతున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) కూడా సాధ్యమయ్యేవి కావు. ప్రపంచ సాంకేతిక పురోగతికి ముస్లిం మేధావులు వేసిన పునాది ఎంత గొప్పదో చెప్పడానికి ఈ గణిత విప్లవమే ఒక సజీవ సాక్ష్యం.

## ఇబ్నెసీనా

వైద్యశాస్త్ర పితామహుడిగా ప్రసిద్ధిగాంచిన ఇబ్నె సీనా (Avicenna) – వైద్య శాస్త్రంలో 'అల్ ఖానూన్ ఫీ తిబ్' అనే గ్రంథాన్ని రచించాడు. ఇది శతాబ్దాలపాటు యూరప్‌లో వైద్య విద్యలో పాఠ్యగ్రంథంగా ఉండేది.

ఈ గ్రంథ విశేషం ఏమిటంటే, ఇది అయిదు భాగాలలో విభజితమై ఉన్న వైద్య శాస్త్ర ఉద్గ్రంథం. గ్రీకు, రోమన్, పర్షియన్, భారతీయ వైద్య విజ్ఞానాన్ని సమ్మిళితంగా, తాత్త్వికంగా, సశాస్త్రీయంగా వివరించిన గ్రంథరాజం. పాశ్చాత్య యూరప్‌లో ఇది 800 సంవత్సరాలు వైద్య విద్యలో ప్రాథమిక పాఠ్యగ్రంథంగా ఉపయోగించబడింది.

దీన్ని లాటిన్ భాషలోకి అనువదించి యూరోపియన్ విశ్వవిద్యాలయాల్లో పాఠ్యపుస్తకంగా ప్రవేశపెట్టారు.

ఈ గ్రంథం రోగ నిర్ధారణ, చికిత్స, ఔషధ శాస్త్రం, శరీర నిర్మాణ శాస్త్రం వంటి వాటిని శాస్త్రీయంగా సమగ్రీకరించింది.

దీని వల్ల యూరోప్‌లో 'రెనైసాన్స్ వైద్య విజ్ఞానానికి' బీజం వేసినట్టే అయింది. ఈయన గారి మరో ముఖ్య రచన

'కితాబ్ అల్ షిఫా'. తత్వశాస్త్రంపై అమూల్య గ్రంథం. (Book of Healing)

ఇబ్నె సీనా కేవలం వైద్య సూత్రాలను క్రోడీకరించడమే కాకుండా, వ్యాధులు ఎలా వ్యాపిస్తాయి (Contagious diseases) అనే అంశంపై అద్భుతమైన పరిశోధనలు చేశారు. ముఖ్యంగా అంటు వ్యాధులు వ్యాపించకుండా ఉండటానికి రోగులను విడిగా ఉంచే 'క్వారంటైన్' (Quarantine) పద్ధతిని ప్రపంచంలోనే మొదటి సారిగా ప్రతిపాదించిన ఘనత ఆయనదే. దీనిని ఆయన 'అల్–అర్బైనియా' అని పిలిచారు. నేటి ఆధునిక వైద్యంలో వాడే 'క్లినికల్ ట్రయల్స్' (Clinical trials – మందుల క్షేత్రస్థాయి పరిశీలన) విధానానికి కూడా ఆయనే ఆద్యుడు. వైద్య శాస్త్రానికి ఆయన చేసిన అసమాన సేవలకు గాను ప్రపంచవ్యాప్తంగా ఆయనను 'ఆధునిక వైద్య పితామహుడు' (Father of Modern Medicine) గా గౌరవిస్తారు. ఒక ముస్లిం శాస్త్రవేత్త శతాబ్దాల క్రితమే మానవాళి ప్రాణాలను రక్షించే అంతర్జాతీయ వైద్య విజ్ఞానానికి దిక్సూచిగా నిలవడం మనందరికీ గర్వకారణం.

## సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్

**సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ (1817 – 1898):** బ్రిటిష్ ఇండియా కాలంలో ముస్లింలలో విద్యాభివృద్ధికి మార్గం వేసిన ప్రముఖ సంస్కర్త. అంగ్ల–ఇస్లామీయ విద్యను సమన్వయం చేస్తూ అలీఘర్ ముస్లిం యూనివర్సిటీకి పునాది వేశారు. ఇతని కృషి వల్లే ముస్లింలలో ఆధునిక విద్యపై అవగాహన పెరిగింది. 1857 ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం తర్వాత ముస్లింలు ఎదుర్కొన్న సామాజిక, ఆర్థిక, విద్యాపరమైన సంక్షోభాన్ని ఆయన కళ్లారా చూశారు. ఆంగ్ల విద్య, శాస్త్రీయ దృక్పథం లేకపోవడం వల్లే ముస్లిం సమాజం వెనుకబడిపోతోందని ఆయన బలంగా నమ్మారు. మతపరమైన మూఢనమ్మకాలను, సంకుచితత్వాన్ని వీడి, పవిత్ర ఖుర్‌ఆన్ బోధన లను ఆధునిక సైన్స్‌తో సమన్వయం చేస్తూ సమకాలీన ప్రపం చంతో పోటీ పడాలని పిలుపునిచ్చారు.

ఈ లక్ష్యసాధన కోసమే ఆయన 1875లో అలీఘర్‌లో 'మహమ్మదన్ ఆంగ్లో – ఓరియంటల్ కాలేజీ'ని స్థాపించారు, ఇదే తర్వాతి కాలంలో ప్రఖ్యాతి గాంచిన 'అలీఘర్ ముస్లిం యూనివర్సిటీ' (AMU)గా రూపాంతరం చెందింది. ధార్మిక విలువలను కాపాడు కుంటూనే పాశ్చాత్య విజ్ఞానాన్ని, ఇంగ్లీష్ భాషను అభ్యసించ వచ్చని ఆయన నిరూపించారు. కేవలం పురుషులకే కాకుండా స్త్రీల విద్యకోసం కూడా ఆయన గళమెత్తారు. ముస్లిం సమాజంలో విద్యా చైతన్యాన్ని రగల్చడానికి ఆయన నడిపిన 'తహెజీబుల్ అఖ్లాక్' అనే పత్రిక నాడు ఒక సామాజిక విప్లవాన్ని తెచ్చింది. విద్యా సంస్కరణల ద్వారా దేశంలో ఒక నూతన మేధావుల తరాన్ని సృష్టించిన మేధావి ఆయన.

**(మిగతా వచ్చే సంచికలో)**

వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ
నైతిక పథకం
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

# సాంకేతికతతో జాగ్రత్త..
# నైతికతే ముఖ్యం: ఎస్ఐఓ పిలుపు

**- డా. అనీస్సుర్ రెహమాన్**
**ఎస్ఐఓ జాతీయ ప్రధాన కార్యదర్శి**





**నంద్యాల:** విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా, ఉత్తమ నైతిక విలువలను పెంపొందించుకున్నప్పుడే తమ కుటుంబానికి, సమాజానికి, తద్వారా దేశానికి ఉత్తమ పౌరులుగా సేవలందించగలరని స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ (SIO) జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ అనీస్ ఉర్ రెహమాన్ ఉద్ఘాటించారు. సంస్థాగత కార్యక్రమాల్లో భాగంగా ఆయన నంద్యాల యూనిట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా నంద్యాలలోని అంటి కోట మసీదు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

నేటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం (టెక్నాలజీ) మానవాళికి ఎంత ప్రయోజనకరమో, అంతే ప్రమాదకరమని ఆయన హెచ్చరించారు. అందువల్ల విద్యార్థులు సాంకేతికతను వాడుకునేటప్పుడు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని హితవు పలికారు. ఈ సమావేశంలో హాఫిజ్ షోయబ్ జమా మాట్లాడుతూ విద్యార్థులు అలవర్చుకోవాల్సిన నైతిక విలువల గురించి సవివరంగా వివరించారు.

జమాఅతె ఇస్లామీ హింద్ స్థానిక అధ్యక్షులు అబ్దుల్ సమద్ మాట్లాడుతూ.. సమాజం పట్ల విద్యార్థులకు, యువతకు ఎంతో గురుతర బాధ్యత ఉందన్నారు. దేశ ముఖచిత్రాన్ని మార్చి, భావితరాలకు ఉన్నతమైన భవిష్యత్తును అందించే వారసులు నేటి విద్యార్థులేనని కొనియాడారు. వారిని సమాజంలోని చెడు రుగ్మతలకు, వ్యసనాలకు దూరంగా ఉంచడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

సమావేశానికి అధ్యక్షత వహించిన రాష్ట్ర ఎస్ఐఓ (SIO) అధ్యక్షులు అమీర్ ఫహద్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తూనే, సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దబడేలా తమ సంస్థ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్దుల్ హఫీజ్, రీజనల్ ఆర్గనైజర్ ఆదిల్ ఖాన్ ఉమ్రి, స్థానిక యూనిట్ నాయకులు ఇందాదుల్లా, అబ్దుల్లా, ఖాజా, డాక్టర్ ఫుర్ఖాన్ నదీమ్, జకరియా, అబ్బాస్ అలీ, షఫీ, ఫయాజ్, అలీంలతో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

---

హైదరాబాద్: ముస్లిం రచయితల సంఘం (మురసం) జాతీయ అధ్యక్షుడు, కవి కరీముల్లా అధ్యక్షతన ఈ నెల 14న జరిగిన రాష్ట్ర కార్యవర్గ మరియు సభ్యుల సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు.

సంఘం నూతన రాష్ట్ర అధ్యక్షుడిగా అబ్దుల్ హాకీం, ప్రధాన కార్యదర్శిగా అబ్దుల్ సమద్, ఉపాధ్యక్షుడిగా మండపేట ముహమ్మద్ షరీఫ్ ఎన్నికయ్యారు. అలాగే సహాయ కార్యదర్శిగా ఈ. వేమన రఫీ, ట్రెజరర్‌గా బషీర్ గర్తపురి ఎంపికయ్యారు. కార్యదర్శులుగా ఎస్.ఎం. సుభాని, ఉమర్ ఫారూఖ్ ఖాన్, ఖుర్షీద్ బేగం, నసీమా బేగం... కార్యవర్గ సభ్యులుగా కంద్రిక ఖాజా వలి, జానీ తదితరులు ఎన్నికైనట్లు జాతీయ అధ్యక్షుడు కరీముల్లా తెలిపారు.




ముస్లింల విద్యాభివృద్ధి, సామాజిక చైతన్యం, మతసామరస్యం, లౌకిక మరియు రాజ్యాంగ విలువల పరిరక్షణతో పాటు తెలుగు భాషాభివృద్ధికి కట్టుబడి పనిచేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు ప్రతిజ్ఞ చేశారు. త్వరలోనే అన్ని జిల్లాల కన్వీనర్లను, కార్యవర్గాలను ఎన్ను కుంటామని, రాష్ట్ర మహాసభలను కూడా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సాహిత్య రంగానికి సంబంధించి కవిసమ్మేళనాలు, కవిత్వం, కథలు, వ్యాసాలపై శిక్షణా తరగతులు, సెమినార్లు ఏర్పాటు చేస్తామన్నారు. అన్ని ప్రగతిశీల, లౌకిక, దళిత, బహుజన సాహితీ శిబిరాలకు తమ సంఘీభావం ఉంటుందని స్పష్టం చేస్తూ... దేశ సమైక్యత కోసం కృషి చేస్తామని, అన్ని రకాల మతోన్మాదాలను, ఉగ్రవాదాలను 'మురసం' వ్యతిరేకిస్తుందని వారు ప్రకటించారు.

# వానొచ్చె.. జాగ్రత్త సుమా! అనారోగ్యం దరిచేరకుండా 'ఇంటి భోజనమే' మేలు!

- డాక్టర్ సాదియా



తుంపరలు పడుతుంటే మనసంతా హాయిగా ఉంటుంది. వేసవి తాపం తర్వాత వచ్చే వాన చినుకులు ఎవరికైనా అమృతంలానే అనిపిస్తాయి. అయితే, ప్రకృతి ప్రసాదించిన ఈ వరం.. మన చిన్నపాటి అజాగ్రత్త వల్ల ఒక్కోసారి శాపంగా మారే ప్రమాదం కూడా ఉంది. వర్షాకాలం అంటేనే ఆహ్లాదంతో పాటు రకరకాల సీజనల్ వ్యాధులు, ఇన్ఫెక్షన్లకు కేరాఫ్ అడ్రస్. అందుకే ఈ కాలంలో మన ఇల్లు, వంటిల్లు, పిల్లలు, పెద్దల విషయంలో కాస్త ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ వర్షాకాలంలో ఆరోగ్యంగా, సురక్షితంగా ఎలా ఉండాలో చూద్దాం...

## ఇంటి పరిశుభ్రతతోనే ఆరోగ్యం!

- వర్షా కాలంలో తేమ, వేడి వాతావరణం వల్ల బ్యాక్టీరియా, వైరస్‌లు చాలా వేగంగా విస్తరిస్తాయి. ఫలితంగా జలుబు, దగ్గు, జ్వరం, విరేచనాలు వంటి సమస్యలు చుట్టుముడతాయి.
- **నీటి నిల్వలు వద్దు:** ఇళ్లలోని పూల కుండీలు, ఖాళీ డబ్బాలు, బకెట్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. ఎందుకంటే నిలిచిన నీటిలోనే మలేరియా, డెంగ్యూ వ్యాప్తి చెందించే దోమలు వృద్ధి చెందుతాయి.
- **దోమల నివారణ:** ఇంట్లో దోమలు చేరకుండా ప్రతిరోజూ దోమల నివారణ మందులను స్ప్రే చేయడం మంచిది.
- **గోడల పగుళ్లు:**ఇంటి గోడలు లేదా పైకప్పుపై ఏవైనా పగుళ్లు, రంధ్రాలు ఉంటే వర్షానికి ముందే వాటిని మూసివేయాలి.

## కరెంట్ జాగ్రత్తలు.. ప్రాణ రక్షణ!


- వర్షాల సమయంలో విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువ. కాబట్టి ఈ విషయాల్లో అస్సలు నిర్లక్ష్యం వద్దు.
- బయట ఉండే ఎలక్ట్రిక్ బోర్డులు, వైరింగ్‌లను ప్లాస్టిక్ కవర్లతో సురక్షితంగా కప్పి ఉంచాలి.
- ఇంట్లో ఉన్నా, బయట ఉన్నా తడి చేతులతో స్విచ్‌లను అస్సలు తాకవద్దు. బయటి నుంచి ఎవరైనా వస్తే డోర్ బెల్ నొక్కడానికి బదులు తలుపు తట్టమని చెప్పడం సురక్షితం.
- రోడ్డు పక్కన ఉండే కరెంట్ స్తంభాలకు దూరంగా ఉండాలి. విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్ల కింద నిలబడకూడదు. ఏదైనా వైర్ తెగిపడితే వెంటనే విద్యుత్ శాఖ సిబ్బందికి సమాచారం అందించాలి.

## బయటి ఫుడ్‌కు నో.. 'ఘర్ కా ఖానా'కే ఓటు!

- చల్లటి వాతావరణంలో వేడివేడిగా చాట్, సమోసాలు, శాండ్‌విచ్‌లు, ఐస్ గోలా, కుల్ఫీ వంటివి తినాలని నోరు ఊరడం సహజం. కానీ, రోడ్డు పక్కన, బహిరంగ ప్రదేశాల్లో అమ్మే ఈ తినుబండారాలలో బ్యాక్టీరియా చేరి జీర్ణక్రియను పూర్తిగా పాడు చేస్తుంది.
- తాజా ఆహారమే ముద్దు:లి ఈ కాలంలో శరీరంలో నీటి శాతం పెంచే జిడ్డు, ఉప్పు, పులుపు ఎక్కువగా ఉండే పదార్థాలకు దూరంగా ఉండాలి. ఇంట్లోనే వండిన తాజా, వేడివేడి ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలి.
  **లైట్ ఫుడ్స్:** సూప్‌లు, వేడి రసం వంటివి ఆహారంలో భాగంగా చేసుకోవాలి. ఇవి జీర్ణం కావడానికి తేలికగా ఉంటాయి, కడుపు బరువుగా అనిపించదు.

## పిల్లలు, వృద్ధుల విషయంలో నో కాంప్రమైజ్!

- ఇంట్లో ఉండే పిల్లలు, వృద్ధులకు రోగనిరోధక శక్తి కాస్త తక్కువగా ఉంటుంది. అందుకే వారిపై ప్రత్యేక నిఘా అవసరం.
- **పిల్లలు వానలో తడిస్తే:** పిల్లలకు వర్షంలో తడవడం అంటే మహా సరదా. కానీ దీనివల్ల ఇన్ఫెక్షన్లు త్వరగా సోకుతాయి. ఒకవేళ పిల్లలు వానలో తడిస్తే, వెంటనే వారిని గోరువెచ్చని నీటితో స్నానం చేయించి, అవసరమైతే యాంటీసెప్టిక్ లోషన్లు వాడాలి.
- **జంక్ ఫుడ్ వద్దు:** పిల్లలకు జంక్ ఫుడ్స్ అస్సలు అలవాటు చేయకూడదు.
- **ముందస్తు జాగ్రత్త:** వర్షాల వల్ల బయటకు వెళ్లడం ఇబ్బంది కావచ్చు కాబట్టి, ఇంట్లో వృద్ధులకు, పిల్లలకు అవసరమైన అత్యవసర మందులను ముందే తెచ్చి సిద్ధంగా ఉంచుకోవాలి.
- వర్షం పడిన వెంటనే అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లకండి. తడి రోడ్లపై నడిచేటప్పుడు జారిపడి గాయాలయ్యే ప్రమాదం ఉంది. తగిన జాగ్రత్తలు పాటిస్తూ.. వేడివేడి ఇంటి వంటలను ఆస్వాదిస్తూ ఈ వర్షాకాలాన్ని సురక్షితంగా ఎంజాయ్ చేయండి!




**ఆందోళనలకు చెక్ పెట్టండి... స్వేచ్ఛగా నవ్వండి!** సమతుల్యతతో కూడిన చిరునవ్వు, హృదయపూర్వకమైన నవ్వు కేవలం పెదవుల కదలిక కాదు; అది మీ మనసుకు కలిగే గాయాలను మాన్పే ఒక అద్భుతమైన ఔషధం! అది మీ ఆత్మకు అమృతాన్ని అందిస్తుంది. అందుకే ఒక మహనీయుడు ఏమన్నారంటే: "నా హృదయానికి కాస్త ఉపశమనం ఇవ్వడానికే నేను నవ్వుతాను!" అవును, నవ్వడం బలహీనత కాదు, గుండె భారానికి విరుగుడు!

### ప్రాపంచిక బాధల నుండి విముక్తి పొందండి

తప్పులు జరిగినప్పుడు పశ్చాత్తాపపడే మనసు వేరు, కేవలం ప్రాపంచిక సుఖాలు, లౌకిక ప్రయోజనాలు దక్కలేదని కుంగిపోయే మనసు వేరు. ఈ ప్రపంచం వెనుక, ఇక్కడి భోగభాగ్యాల వెనుక పరుగెడుతూ, అవి దక్కనప్పుడు దుఃఖంలో మునిగిపోవడం ఒక చీకటి రాత్రి లాంటిది. ఆ చీకటి మీ ఎదుగుదల అనే మార్గానికి అతిపెద్ద అడ్డంకి! అది మీ ప్రయాణాన్ని అడ్డుకునే ఒక ముళ్ల కంచె. ఆ దుఃఖం నుండి రక్షణ పొందడమే మన కర్తవ్యం.

### దుఃఖం : మిమ్మల్ని కరిగించి, మెరుగుపెట్టే కొలిమి!

జీవితంలో కష్టాలు, శోధనలు, అనారోగ్యాలు రావడం సహజం. అయితే, ఈ దుఃఖం అనేది మీ గమ్యస్థానం కాదు, అది కేవలం దారిలో ఎదురయ్యే ఒక చిన్న పరీక్ష మాత్రమే. ప్రసిద్ధ ఆధ్యాత్మిక చింతకులు చెప్పినట్లు--- దుఃఖం మిమ్మల్ని నాశనం చేయదు, ఒకవేళ అది మిమ్మల్ని తప్పుదోవ పట్టించనంతవరకు, అది మీలోని మలినాలను కడిగేసి మిమ్మల్ని నిష్కల్మషంగా మారుస్తుంది!

### ఈ క్షణాన్నే స్వర్గంగా మార్చుకోండి...

ఈ జీవితం క్షణభంగురం, ఇక్కడి సంపదలు శాశ్వతం కావు. అందుకే రాబోయే రేపటి గురించి భయపడుతూ కూర్చోవద్దు. దైవాన్ని ఇలా వేడుకుందాం:

"ఓ ప్రభూ! మా హృదయాలను నిశ్చలమైన విశ్వాసం (యకీన్) అనే వెలుగుతో నింపు. మా మనసులను ఎల్లప్పుడూ సత్య మార్గంలో (రుజుమార్గంలో) నడిపించు. ఈ జీవితంలో మాకు కష్టాలు, ఇబ్బందులు లేని ప్రశాంతమైన, ఆహ్లాదకరమైన జీవితాన్ని ప్రసాదించు."

**గుర్తుంచుకోండి** : ఈ లోకంలో లభించిన దైవ అనుగ్రహాలకు కృతజ్ఞత తెలుపుతూ, సంతోషంగా జీవించడమే అసలైన స్వర్గం! ఇక్కడ సంతోషాన్ని వెతుక్కోలేని వాడు, పరలోకంలోనూ స్వర్గాన్ని ఆస్వాదించలేడు. కాబట్టి... హృదయాన్ని శుద్ధి చేసుకోండి, మనశ్శాంతిని ఆహ్వానించండి, ప్రతిక్షణం చిరునవ్వుతో ముందుకు సాగండి!?

**- ముహమ్మద్ రఫీఖ్**

వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ
నైతిక పథకం
సహజీవన భావనల పావురాయి
గేటురాయి
వారపత్రిక




- యాఖూబ్

**తూర్పు కొండల్లోంచి మెల్లగా జారుకునే లేత గులాబీ రంగు కిరణం మన ఇంటి గుమ్మాన్ని తాకగానే... ఒక కొత్త రోజు మొదలవుతుంది. కిటికీలోంచి వచ్చే చల్లటి గాలి ఒంటిని తాకు తున్నప్పుడు... మనసు మాత్రం ఎందుకో నిన్నటి ఆందోళనల గురించో, రేపటి అప్పుల గురించో గుబులు పడుతూ ఉంటుంది. మంచం దిగక ముందే చేతిలోకి వచ్చే స్మార్ట్‌ఫోన్ నోటిఫికేషన్లు గుండె వేగాన్ని పెంచుతుంటాయి.**

కానీ, ఒక్క క్షణం ఆగుదాం. శ్వాసను నిదానించి ఆలోచిద్దాం. ఉదయపు మొదటి ముప్పై సెకన్లు మన రోజంతటినీ... కాదు కాదు, మన జీవితాన్నే మార్చేయగలవని మీకు తెలుసా? నిరాశతో కాకుండా, ఒక అద్భుతమైన నమ్మకంతో రోజును ఎలా ప్రారంభించాలో చెప్పే కొన్ని హృద్యమైన జీవన సూత్రాలు ఇవి. ఒక ఆదివారం ఉదయం తీరిగ్గా కాఫీ కప్పు చేతపట్టుకుని, గుండెకు హత్తుకునేలా చదువుకోవాల్సిన సరికొత్త అంతరంగ ఆవిష్కరణ ఇది..

### 1. ఆయుష్షు నిచ్చిన అద్భుతం: 'అల్హందులిల్లాహ్'

రాత్రి నిద్రపోయేటప్పుడు ఎన్నో ప్లాన్లు వేసుకుంటాం. కానీ, నిద్ర లోనే శాశ్వతంగా కన్నుమూసే లక్షలాది మందిలో మనం ఒకరిగా మిగిలిపోలేదు. ఈ ఉదయం మన కళ్ళు తెరుచుకున్నాయంటే, గుండె ఇంకా కొట్టుకుంటోందంటే... సృష్టికర్త మనకు మరో అవకాశాన్ని ఇచ్చాడని అర్థం. ఇస్లామిక్ జీవన విధానంలో దీన్నే 'అల్హందు లిల్లాహ్' (అల్లాహ్‌కు కృతజ్ఞతలు) అంటారు. నిన్నటి తప్పులను సరిదిద్దుకోవడానికి, విరిగిపోయిన బంధాలను ముడిపెట్టుకోవ డానికి దక్కిన ఈ కొత్త రోజును ఫిర్యాదులతో కాకుండా... బ్రతికి ఉన్నందుకు కృతజ్ఞతతో స్వాగతిద్దాం.

### 2. భయాల చీకటిని చీల్చే నమ్మకం

"రేపు నా ఉద్యోగం ఉంటుందా? పిల్లల భవిష్యత్తు ఏంటి? నా ఆరోగ్యం క్షీణిస్తే ఎలా?"- ఇలాంటి ఊహాజనిత భయాల పంజరంలో చాలామంది బందీలైపోతుంటారు. వాస్తవానికి, భవిష్యత్తు ఎప్పుడూ మన చేతుల్లో లేదు. మన వంతు ప్రయత్నం మనం చేసి, ఫలితాన్ని ఆ పైవాడి సృష్టి నియమాలకు వదిలి పెట్టడమే అసలైన విశ్వాసం (తవక్కుల్). నిన్నటి దాకా మనల్ని కాపాడిన ప్రకృతి, ఈ రోజు కూడా మనల్ని ఒంటరిని చేయదనే నమ్మకం ఉంటే... గుండెల్లో భయం పోయి కొండంత ధైర్యం వస్తుంది.

### 3. మనశ్శాంతిని ఇతరుల చేతుల్లో పెట్టకండి

కొందరికి ఉదయం అంతా బాగుంటుంది, కానీ ఆఫీసులో ఎవరో ఒక చిన్న మాట అనగానే మూడ్ పాడైపోతుంది. ఎందుకు మన సంతోషాన్ని ఇతరుల చేతుల్లో పెట్టాలి? లోకంలో ప్రతి ఒక్కరినీ

మెప్పించడం ఎవరికీ సాధ్యం కాదు. సత్య మార్గంలో నడిచిన మహోన్నత ప్రవక్తలు సైతం విమర్శలు, నిందలు ఎదుర్కొన్నారు. "సమాజం నన్ను మెచ్చుకుంటోందా?" అని కాకుండా, "నా అంతరాత్మకు నేను నిజాయితీగా ఉన్నానా?" అని సరిచూసుకుంటే... ఇతరుల మాటలు మన మనశ్శాంతిని అస్సలు కదల్చలేవు.

### 4. ఓర్పు... నిశ్శబ్ద సముద్రమంత బలం

జీవితం అంటేనే ఎత్తుపల్లాలు. అనుకున్న పనులు అనుకున్నట్టు జరగకపోవచ్చు. చిన్న ఆలస్యానికో, ఎదుటివారి ప్రవర్తనకో వెంటనే ఆగ్రహంతో ఊగిపోవడం సులభం. కానీ, అసలైన బలం ఓపిక (సబర్) వహించడంలోనే ఉంది. ఓర్పు అంటే చేతకాక ఊరుకోవడం కాదు, తుఫాను లాంటి కష్టాల్లోనూ మనసును నిలకడగా ఉంచుకోవడం. ఈ రోజు మనకు ఎదురయ్యే ప్రతి సవాలు వెనుక ఒక పాఠం ఉంటుందని నమ్మి, కాస్త నిదానిస్తే రోజంతా ప్రశాంతంగా సాగిపోతుంది.

### 5. మధురమైన మాట... లేదా అమూల్యమైన మౌనం

మాట అనేది ఒక పదునైన బాణం. బాణం విసిరిన తర్వాత వెనక్కి తీసుకోలేం. ఒక చిన్న కోపంలో అన్న మాట, ఎన్నో ఏళ్ల అనుబంధాన్ని క్షణంలో తుడిచేయగలదు. అందుకే, ఉదయాన్నే ఒక సంకల్పం చేసుకుందాం---"ఈ రోజు నా నోటి నుండి వస్తే మంచి మాట రావాలి, లేదంటే మౌనమే మిగలాలి." ఒకరిని ఓదార్చేందుకు, ఉత్సాహపరిచేందుకు మాటను వాడదాం. అవసరం లేని చోట మౌనంగా ఉంటే ఎన్నో అనర్థాలు దానంతట అవే ఆగిపోతాయి.

### 6. లేని వాటి కోసం కాదు... ఉన్న వాటి కోసం జీవిద్దాం

మనుషులుగా మనకు ఒక బలహీనత ఉంది. పక్కవాడి పెద్ద ఇల్లో, లగ్జరీ కారో చూసి మనకున్న చిన్న సంతోషాలను మర్చిపోతాం. ఒక్కసారి ఊహించండి... ఈ ఉదయం మనం స్పష్టంగా చూడగలుగుతున్నాం, నడవగలుగుతున్నాం, శ్వాస తీసుకోగలుగుతున్నాం. ఆసుపత్రి గదుల్లో నరకం అనుభవిస్తున్న ఎంతోమంది కోరుకునే భాగ్యం ఇది. మన జీవితంలో ఒకప్పుడు మనం అల్లాహ్‌ను కోరుకుని, ఈ రోజు సాధించుకున్న అద్భుతాలు ఎన్నో ఉన్నాయి. వాటిని గుర్తించి తృప్తిగా బతకడమే అసలైన పండగ.

### 7. ఈ రోజే ఆఖరి రోజు అయితే...?

మరణం అనే పదం వినడానికి చేదుగా అనిపించవచ్చు. కానీ, అది ఇచ్చే స్పష్టత మరేదీ ఇవ్వలేదు. రేపు అనేది మనకు గ్యారెంటీ లేని ఒక హామీ. "ఈ రోజే నా జీవితంలో చివరి రోజు అయితే... నేను ఎవరితోనైనా గొడవపడతానా? చిన్న విషయాలకే కోపగిస్తానా?" అని ప్రశ్నించుకుంటే... బంధాల విలువ తెలుస్తుంది. గర్వం కరిగిపోతుంది. చేయాల్సిన మంచి పనులను, ప్రార్థనలను రేపటికి వాయిదా వేసే అలవాటు తప్పుతుంది. ప్రతి క్షణం అమూల్యంగా మారుతుంది.

### ఉదయపు వెలుగుల్లో... ఓ నవ సంకల్పం

జీవితం అనేది ఏదో ఒక రోజు అద్భుతంగా మారిపోదు. మనం ప్రతి ఉదయం తీసుకునే చిన్న చిన్న నిర్ణయాలే మన వ్యక్తిత్వాన్ని మలుస్తాయి. రేపు ఉదయం అలారం మోగగానే, స్మార్ట్‌ఫోన్ వైపు చేయి చాచక ముందే... ఒక్క నిమిషం కళ్ళు మూసుకుని ఈ సూత్రాలను మననం చేసుకుందాం. నిరాశ చీకట్లను తుడిచేస్తూ, మనసులో ఆశాకిరణాలను నింపుకుంటూ కొత్తగా అడుగులు వేద్దాం.

అల్లాహ్ మన హృదయాలను కృతజ్ఞతతో, మన మాటలను మధురంగా, మన జీవితాలను శాంతితో నింపాలని ఆకాంక్షిస్తూ... మరోసారి శుభోదయం


యువతరానికి
విప్లవనాదం
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

ఒక వారం చదవండి
ప్రతి వారం చదువుతారు !

చందా వివరాలు

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి
గీటురాయి వారపత్రికను
తెప్పించుకోవచ్చు.

బ్యాంక్ అకౌంట్ వివరాలు
GEETURAI WEEKLY
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789768
IFSC Code. CBIN0282407

లేదా

పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా
పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే
డి.డి.ని 'Geeturai Weekly'
పేర మాత్రమే తీయాలి.

GEETURAI WEEKLY
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com

కథ



# ప్రేమ తీరం

**అబ్దుస్సమద్, నంద్యాల**

**రామనాథం కళ్ళు జీవం లేకుండా ఉన్నాయి. శూన్యంలోకి అలా చూస్తూ ఉండిపోయాడు. వారం రోజులుగా ఆయన పరిస్థితి ఇదే. యాంత్రికంగా సాగుతున్న ఆయన జీవన శైలిలో ఒక నిర్జీవత్వం అగుపిస్తోంది. కనీసం చేతిలో ఉన్న సెల్‌ఫోన్ తాకడానికే అసహ్యం వేస్తోంది. నిత్యం తను ద్వేషాన్ని వెదజల్లిన ఆ ఫోనే, ఇప్పుడు తన్ను చూసి వెటకారంగా నవ్వుతున్నట్లు అనిపిస్తోంది. కాస్త నిదానించి చూస్తే... రామనాథం జీవితం ఎందరికో ఒక కనువిప్పు!**

రామనాథం ఒక విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి. 'జీవితం శాశ్వతం కాదు... క్షణభంగురమైన ఈ ప్రయాణంలో అందరితో కలిసిమెలిసి ఉండాలి, అందరి ప్రేమానురాగాలు పొందాలి' అని ఆయన ఏనాడూ అనుకోలేదు. తన పని తనేదో చూసుకోవడం తప్ప, చుట్టుపక్కల వారి గురించి కానీ, తోటి ఉద్యోగుల గురించి కానీ పట్టించుకున్న పాపాన పోలేదు. ఆ స్వార్థపూరిత ధోరణిలోనే ఉద్యోగ ప్రయాణాన్ని ముగించి, పదవీ విరమణ చేశాడు.

విశ్రాంత జీవితంలోనైనా ప్రశాంతంగా ఉండకుండా... తలకెక్కించుకున్న మతోన్మాదాన్ని మరింత పెంచుకున్నాడు. ఒకప్పుడు కొందరు వ్యక్తులు ముఖాముఖి మాటల్లో కల్మషాన్ని వెళ్లగక్కి పైశాచికానందం పొందేవారు. కానీ ఇప్పుడు, చేతిలో ఇమిడిపోయే స్మార్ట్‌ఫోన్లతో ఆ విద్వేషం మరింత పేట్రేగిపోతోంది. ఇతరుల మనోభావాలతో వారికేం పని? తమకో పైశాచిక ఆనందం దొరికితే చాలు!

రామనాథం కూడా సరిగ్గా ఇదే కోవకు చెందినవాడు. సోషల్ మీడియాలో పెచ్చరిల్లిపోయే మతద్వేషంలో పూర్తిగా మునిగిపోయాడు. సామాజిక మాధ్యమాల్లో ఆయినో యుద్ధవీరుడిలా విజృంభించేవాడు. సమాజం పట్ల, పక్కవారి పట్ల ఆయన హృదయం ఎప్పుడూ అసహనంతో రగిలిపోయేది. ఒక నిర్దిష్ట వర్గమన్నా, ఒక ప్రత్యేక రాజకీయ సిద్ధాంతమన్నా ఆయనకు విపరీతమైన క్రోధం.

## ద్వేషపు పతాకస్థాయి

రామనాథం ద్వేషం ఏ స్థాయికి చేరిందంటే... ప్రపంచంలో ఎక్కడో సుదూర తీరాల్లో యుద్ధాలు జరుగుతూ, అమాయక పిల్లలు, తల్లులు ప్రాణాలు కోల్పోతుంటే... ఆయన మాత్రం తన ఫోన్ స్క్రీన్ చూస్తూ క్రూరమైన ఆనందాన్ని పొందేవాడు. "సరైన శాస్తి జరిగింది! వీళ్లనందరినీ ఇలాగే ఏరిపారేయాలి" అంటూ రాక్షసానందంతో పోస్టులు పెట్టేవాడు. అవతలి వర్గం సర్వనాశనం అయిపోవాలనే పగటి కలల చుట్టూనే ఆయన ఆలోచనలు తిరిగేవి.

రామనాథానికి ఒక్కడే కొడుకు... పేరు ఆనంద్. తండ్రి మనసంతా ద్వేషంతో నిండి ఉంటే, కొడుకు ఆనంద్ మాత్రం సముద్రమంత ప్రశాంతమైనవాడు. ఆనంద్ నిష్కల్మష హృదయంలో మానవత్వాన్ని గౌరవించే, ప్రేమించే నైజం ఉంది. చిన్న వయసులోనే మేరైన్ ఇంజనీర్ అయ్యాడు. విచిత్రం ఏమిటంటే... రామనాథం ఏ వర్గాన్నైతే నిత్యం ద్వేషించేవాడో, ఆ వర్గానికి చెందిన ఒక ముస్లిం దేశ తీరంలోనే ఆనంద్‌కు ఓడలో ఉద్యోగం వచ్చింది.

కొన్ని ఏళ్లు అక్కడ పనిచేసి వస్తే, ఆ తర్వాత ఇక్కడ ప్రభుత్వ లేదా ప్రైవేట్ రంగంలో మంచి ఉద్యోగం వస్తుందని, పైగా

కొడుకు సంపాదన కావాలి కాబట్టి... రామనాథం మనసులో ఇష్టం లేకపోయినా ఉద్యోగానికి పంపించాడు. ఆ దేశం ఇచ్చిన జీతంతోనే ఇక్కడ రామనాథం ఒక పెద్ద ఇల్లు కట్టాడు. ఆనంద్ పంపే డబ్బులతోనే రామనాథం విలాసాలు సాగేవి. అయినా సరే, ఆయనలోని ద్వేషం మాత్రం చావలేదు.

### ఆ దురదృష్టకర రాత్రి

ఒక రాత్రి... అది విధి ఆడిన వింత నాటకం. రామనాథం ఎప్పటి లాగే సోషల్ మీడియాలో మునిగిపోయాడు. ఒక అగ్రదేశాధినేత చేసిన యుద్ధ ప్రకటన సందేశాన్ని చూసి ఉత్తేజితుడయ్యాడు. వెంటనే దాన్ని రీ-పోస్ట్ చేస్తూ... "యుద్ధం వస్తేనే శాంతి వస్తుంది! శత్రువులను తుడిచిపెట్టాలి!" అంటూ వ్యాఖ్యలు రాశాడు. కానీ, ఆ సమయంలో ఆయనకు తెలియదు... తాను పొగుడుతున్న ఆ అగ్ర దేశపు క్షిపణులు అప్పటికే ఆకాశంలో దూసుకు పోతున్నాయని!

మరోవైపు... ఒమన్ తీరానికి కొద్ది దూరంలో ఉన్న అంతర్జాతీయ జలాల్లో ఆనంద్ ప్రయాణిస్తున్న నౌక సాగిపోతోంది. అగ్రదేశం ప్రయోగించిన ఒక అత్యాధునిక క్షిపణి లక్ష్యం తప్పి, ఆనంద్ ఉన్న నౌకను బలంగా ఢీకొట్టింది. ఆ మారణహోమంలో... ఏ తప్పు ఎరుగని, ఏ యుద్ధంతోనూ సంబంధం లేని ఆనంద్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు.

ఇక్కడ విధి చేసిన మరో పెద్ద విచిత్రం ఏమిటంటే... రామనాథం ఏ ముస్లిం దేశాన్ని అయితే నిత్యం శపించేవాడో, ఆ దేశపు సైన్యమే ఆనంద్ మృతదేహాన్ని ఎంతో గౌరవంగా సముద్రం నుండి వెలికితీసి, భద్రపరిచింది. కానీ, రామనాథం ఏ అగ్రదేశాన్ని అయితే దేవుడిలా పూజించేవాడో, ఆ దేశం వేసిన క్షిపణే ఆయన సర్వస్వాన్ని లాగేసుకుంది... ఆయన వంశాంకురాన్ని కుప్పకూల్చింది.

### నిఖార్సైన నిజం

మరుసటి రోజు ఉదయం రామనాథానికి ఆ ఘోర వార్త తెలిసింది. కాలం ఒక్కసారిగా ఆగిపోయినట్లయింది. చేతిలోని ఫోన్ కింద పడిపోయింది. తాను నిన్న రాత్రి పెట్టిన యుద్ధ అనుకూల పోస్టులు, వాటికి వచ్చిన లైకులు... ఇప్పుడు తన కొడుకు శవం ముందు నిలబడి వెక్కిరిస్తున్నట్లు అనిపించాయి.

"యుద్ధం అంటే ఎక్కడో టీవీల్లో చూసే రక్తం కాదు... అది మన కంటి ముందే మన సొంత రక్తాన్ని పిండేసే ఒక రాక్షసి" అని రామనాథానికి అప్పుడు అర్థమైంది.

అతను ఏ శత్రువు చావును కోరుకుంటూ ఇక్కడ ఆనందపడ్డాడో... ఈరోజు అదే యుద్ధ భూమిలో తన కన్నకొడుకును కోల్పోయి అంతులేని విషాదంలో మునిగిపోయాడు. ద్వేషం అనేది ఒక అంధకారం... అది అవతలివాడిని కాల్చడమే కాదు, మనల్ని కూడా బూడిద చేస్తుందని ఆ తండ్రికి ఆలస్యంగా తెలిసొచ్చింది.

రామనాథం ఇంటి ముందు ఇప్పుడు నిశ్శబ్దం రాజ్యమేలుతోంది. కొడుకు పార్థివ దేహం ముందు కూర్చొని ఆయన విలపిస్తున్నాడు. ఆయన కళ్లల్లో ఇప్పుడు ద్వేషం లేదు, కేవలం పశ్చాత్తాపపు కన్నీళ్లు మాత్రమే ఉన్నాయి. సోషల్ మీడియాలో తనను 'లైక్'లతో ప్రోత్సహించినవారెవరూ ఇప్పుడు ఆయన కన్నీరు తుడవడానికి రాలేదు.

యుద్ధాలు ఎవరికీ విజయాన్ని ఇవ్వవు. ఒకరి మరణాన్ని కోరుకోవడం అంటే, మన వినాశనాన్ని మనమే కొనితెచ్చుకోవడం. ప్రపంచానికి ఇప్పుడు కావాల్సింది ఆయుధాల గర్జన కాదు... ప్రేమతో కూడిన ఆలింగనం.

ద్వేషం అనే బజారులో... ప్రేమ అనే పూలను అమ్ముదాం. ఎందుకంటే, ప్రపంచాన్ని గెలవాల్సింది పగతో కాదు, కేవలం అనురాగంతోనే!


## చందాదారులకు విజ్ఞప్తి

**చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.**

**వివరాలకు ఈ నెంబరుకు ఫోన్ చేయండి 9704317015**

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
Hyderabad- 500 002, Telangana

Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

**తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది** **ఖుర్‌ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్**

**29 ఆయత్‌లు** **మదీనా అవతరణ**

# 48. అల్ ఫత్హ్

17 గ్రుడ్డివాడు, కుంటివాడు, రోగగ్రస్తుడు జిహాద్‌కు రాలేకపోతే అందులో తప్పులేదు.[31] ఎవడయితే అల్లాహ్‌కు, ఆయన సందేశహరునికీ విధేయుడవుతాడో అల్లాహ్ అతన్ని స్వర్గాలలోకి ప్రవేశం కల్పిస్తాడు, వాటి దిగువన కాలువలు ప్రవహిస్తూ ఉంటాయి మరెవడయితే విముఖుడవుతాడో అతనికి ఆయన వ్యధాభరితమయిన యాతన విధిస్తాడు."

18 – 21 అల్లాహ్ విశ్వాసుల పట్ల ప్రసన్నుడయ్యాడు, వారు చెట్టు క్రింద నీతో ప్రమాణం చేస్తూ ఉన్నప్పుడు.[32] వారి హృదయాల స్థితి ఆయనకు తెలుసు, అందువల్ల ఆయన వారికి ప్రశాంతతను అవతరింపజేశాడు. వారికి బహుమానంగా సమీప విజయాన్ని అనుగ్రహించాడు,

31. అంటే, ఒక వ్యక్తి జిహాద్‌లో పాల్గొనే విషయంలో యదార్థం గానే ఏదయినా వాస్తవ కారణం అడ్డు వస్తే అతన్ని పట్టు కోవడం జరగదు. కాని శరీర దారుఢ్యంతో దుంగలా ఉండే వారు ఏవయినా సాకులు చెప్పి కూర్చుండిపోతే వారిని, అల్లాహ్, ఆయన ధర్మం పట్ల చిత్తశుద్ధి గలవారని నమ్మడం సాధ్యం కాదు. ముస్లిమ్ సమాజంలో చేరినందుకు లభించే ప్రయోజనాలనయితే వారు ప్రోగు చేసుకుంటూ ఉంటూనే ఇస్లామ్ కొరకు త్యాగాలు అర్పించుకునే సమయం వచ్చినప్పుడు తమ ధన ప్రాణాలను భద్రపరచుకుంటూ ఉండే అవకాశం వారికి ఇవ్వడం సాధ్యపడదు.

ఈ సందర్భంలో ఒక విషయం తెలుసుకోవడం అవసరం. షరీఅత్ ప్రకారం జిహాద్‌లో పాల్గొనడం పట్ల మినాయింపు లభిం చింది రెండు రకాల వ్యక్తులకు. ఒకటి, శారీరకంగా యుద్ధానికి తగనివారు. ఉదాహరణకు పిన్న వయస్కులయిన బాలురు, స్త్రీలు, మతిభ్రమించిన వారు, గ్రుడ్డివారు యుద్ధ సేవలు అందించలేని వ్యాధిగ్రస్తులు, కాళ్ళూ చేతులు చచ్చు పడిపోవడం చేత యుద్ధంలో పాల్గొనలేని వికలాంగులూ. రెండు, మరికొన్ని సమంజసమయిన కారణాల వల్ల జిహాద్‌లో పాల్గొనడం కష్టసాధ్యమయిన వ్యక్తులు. ఉదాహరణకు, బానిసలు, ఇంకా పోరాడటానికి సిద్ధంగా ఉన్నా వారి కొరకు ఆయుధాలు తదితర అత్యవసర సాధనాలు ప్రాప్తం కాని వ్యక్తులు, లేదా రుణగ్రస్తులు, వీరికి అతి త్వరగా అప్పు తీర్చ వలసి ఉండగా రుణదాత వారికి వ్యవధి నివ్వకపోయి నప్పుడు, లేదా తల్లిదండ్రులు లేదా వారిలో ఒకరు సజీవంగా ఉండి, సంతానం వారిని కనిపెట్టుకు ఉండే అగత్యమున్నప్పుడు. ఈ సందర్భంలో ఒక విషయం విశదమవడం అవసరం, తల్లి దండ్రులు ముస్లిములయినట్లయితే సంతానం వారి అనుమతి లేకుండా జిహాద్‌కు వెళ్ళరాదు, కాని వారు తిరస్కారులయినట్లయితే వారు ఆపడం వల్ల ఆగిపోవడం ధర్మ సమ్మతం కాదు.

32. ఇక్కడ తిరిగి అదే బయ్‌త్ (ప్రమాణం) ప్రస్తావన వచ్చింది, హుదైబియా ప్రాంతంలో ప్రవక్తశ్రీ (స) సహచరులచేత చేయించు కున్న ప్రమాణం. దీన్ని బయ్‌తురిజ్వాన్ అని అంటారు. ఈ ఆయత్‌లో శుభవార్తనివ్వడం జరిగింది, ఈ ప్రమాదభరితమయిన సందర్భంలో ప్రాణాలకు తెగించి స్వయం సమర్పణకు సిద్ధమవడంలో ఎంతమాత్రం జంకు గొంకు చూపకుండా దైవ సందేశహరుల చేతి మీదుగా తలను పణంగా పెట్టే ప్రమాణం (బయ్‌త్) చేసి తాము తమ విశ్వాసంలో సత్యవంతులమని స్పష్ట మయిన రుజువు చూపిన వారి పట్ల అల్లాహ్ ప్రసన్నుడయ్యాడని. ఆ సమయంలో ముస్లిములు కేవలం ఒక్క కరవాలం మటుకే తీసుకువచ్చారు. కేవలం పద్నాలుగు వందల మంది మాత్రమే ఉన్నారు. యుద్ధ వస్త్రాలలోనూ లేరు. ఇహ్రామ్ దుప్పట్లు మటుకే కట్టుకు వచ్చినవారు. తమ నివాసం యుద్ధ కేంద్రం(మదీనా)కు రెండు వందల యాభయి మైళ్ళ దూరాన ఉన్నారు. ఇక శత్రువు కేంద్రస్థానమేమో కేవలం 13 మైళ్ళ దూరాన ఉంది, అక్కడి నుండి వారు ఏ విధమయిన సహాయాన్నయినా తెప్పించుకో గలరు.

**(32వ పాదసూచిక మిగతా వచ్చే సంచికలో)**

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (6వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)
తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

كِتَابُ التَّفْسِيرِ
## ఖుర్ఆన్ వ్యాఖ్యాన ప్రకరణం
(కితాబుత్తఫ్సీర్)

**11. హూద్ సూరా**

## ప్రభువు ఒక దుర్మార్గపు నగరాన్ని శిక్షించ దలిస్తే...

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "నీ ప్రభువు ఒక దుర్మార్గపు నగరాన్ని శిక్షించదలిస్తే, ఆయన శిక్ష(పట్టు) ఇలాగే ఉంటుంది. నిజంగానే ఆయన శిక్ష (పట్టు) బహుకఠినమైనది. బహుబాధాకరమైనది." **(11: 102)**

**529)** ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఈ విధంగా ప్రవచించినట్లుగా అబూ మూసా(రజి) ఉల్లేఖించారు: "అల్లాహ్ దుర్వర్తనునికి ప్రపంచంలో కొన్నాళ్ళ పాటు గడువు ఇస్తూ ఉంటాడు. కాని అతనిని పట్టుకోదలిస్తే మాత్రం ఇక విడిచిపెట్టడు". ఉల్లేఖకుడు ఏమన్నారంటే, ఆ తరువాత ఆయన(స) ఈ ఆయత్‌ను పఠించారు: "నీ ప్రభువు ఒక దుర్మార్గపు నగరాన్ని పట్టుకోదలిస్తే, ఆయన పట్టు ఇలాగే ఉంటుంది. నిజంగానే ఆయన పట్టు మా గట్టిది. అత్యంత బాధాకరమైనది." ***(11 : 102)***

## సత్కార్యాలు దుష్కార్యాలను దూరం చేస్తాయి

దైవోపదేశం– "చూడు! నమాజును స్థాపించు. పగటి యొక్క రెండు సరిహద్దు సమయాల లోనూ, కొంత రాత్రి గడిచిన తరువాతనూ. వాస్తవానికి సత్కార్యాలు దుష్కార్యాలను దూరం చేస్తాయి. అల్లాహ్‌ను జ్ఞాపకం ఉంచుకునే వారికి ఇది ఒక జ్ఞాపిక."[1] ***(11: 114)***

**530)** ఇబ్నె మస్‌ఊద్ (రజి) కథనం: ఒక వ్యక్తి ఒక పరాయి స్త్రీని ముద్దు పెట్టుకుని దైవప్రవక్త(సఅసమ్) సన్నిధిలోకి వచ్చి, తనంతట తానుగా తన తప్పును ఒప్పుకున్నాడు. అప్పుడు ఈ ఆయత్ అవతరించింది: "నమాజును స్థాపించు– పగటి యొక్క రెండు సరిహద్దు సమయాలలోనూ, కొంత రాత్రి గడిచిన తరువాతనూ. వాస్తవానికి సత్కార్యాలు దుష్కార్యాలను దూరం చేస్తాయి. అల్లాహ్‌ను జ్ఞాపకం ఉంచుకునే వారికి ఇది ఒక జ్ఞాపిక." ఆ వ్యక్తి ఈ ఆయత్ కేవలం నా కొరకేనా? (అంటే 'సత్కార్యాలు దుష్కార్యాలను దూరం చేస్తాయి' అన్న ఆయత్ నా కోసమేనా?) అని అడిగితే, "దీనికి కట్టుబడిన నా ఉమ్మత్ లోని ప్రతి వ్యక్తికీ ఇది వర్తిస్తుంది"[1] అని దైవప్రవక్త(స) చెప్పారు.

5-1. ఒక వ్యక్తి ఒక పరాయి స్త్రీ చేతిని తాకే లేక కేవలం ఆమెను ముద్దుపెట్టుకునే చేష్టకు ఒడిగట్టాడు. ఆ నేపథ్యంలో ఈ ఆయత్ అవతరించింది.

530-1. అంటే తప్పు జరిగినప్పుడు సిగ్గుతో కుంచించుకుపోవాలి. నిష్కల్మషమైన మనసుతో పశ్చాత్తాపపడాలి. నమాజును నెలకొల్పాలి. అప్పుడు అల్లాహ్ అతని పాపాన్ని క్షమి స్తాడు. పగటి యొక్క రెండు సరిహద్దులు అంటే ఫజ్ర్ మగ్రిబ్ నమాజులు. రాత్రి అంటే ఇషా నమాజ్. ఇక జుహ్ర్, అస్‌ల ప్రస్తావన వేరితర ఆయత్‌లలో ఉంది.

# వ్యక్తిగత స్వేచ్ఛ రాజ్యాంగ హక్కుల పరీక్ష




**ముహమ్మద్ హారూన్ అహ్మద్ ఖాన్**

ఉత్తరప్రదేశ్‌లోని షామ్లీ జిల్లాలో చోటు చేసుకున్న ఆయుష్ మలిక్–చాంద్నీ ఖురైషీ వ్యవహారం క్రమంగా ఒక కుటుంబ వివాదాన్ని దాటి దేశవ్యాప్త చర్చనీయాంశంగా మారింది. సామాజిక మాధ్యమాలు, టెలివిజన్ చర్చలు, రాజకీయ వ్యాఖ్యలు, మతపరమైన వాదోపవాదాల మధ్య అసలు ప్రశ్న మరుగున పడుతోంది. ఒక వయోజన వ్యక్తి తన ఇష్టప్రకారం ఒక మతాన్ని స్వీకరించి, తనకు నచ్చిన వ్యక్తిని వివాహం చేసుకుంటే, ఆ నిర్ణయాన్ని సమాజం, దేశం గౌరవించాల్సిన అవసరం ఉందా? లేదా?

ఈ కేసులో వివాదం చుట్టూ అనేక కథనాలు ప్రచారంలోకి వచ్చాయి. ఇందులో మనకు స్పష్టంగా కనిపించే విషయం ఏమిటంటే, ఆయుష్ మలిక్ మైనర్ కాదు, అతను వయోజనుడు. భారత రాజ్యాంగం ప్రకారం తన జీవితం, తన విశ్వాసం, తన వివాహం గురించి స్వతంత్రంగా నిర్ణయం తీసుకునే హక్కు, అధికారం కలిగిన పౌరుడు. స్వయంగా ఆయనే చేసిన ప్రకటన ప్రకారం, దాదాపు పుష్కరకాలానికి పూర్వమే అతను ఇస్లాం స్వీకరించాడు. చాంద్నీ ఖురైషీతో పరిచయం మాత్రం చాలా తరువాత ఏర్పడింది. అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం, ఆరేళ్ళ క్రితం పరిచయం ఏర్పడి, ఆ తరువాత వివాహం జరిగింది.

ఈ క్రమాన్ని పరిశీలిస్తే ఒక ప్రశ్న సహజంగానే తలెత్తుతుంది. ఒక వ్యక్తి పన్నెండేళ్ళ క్రితం మతం మార్చుకుని ఉంటే, ఆరేళ్ల క్రితం పరిచయమైన వ్యక్తి అతనిని మతం మార్చిందని చెప్పడం ఎంతవరకు సహేతుకం? ఈ అంశమే ఈ కేసులో ప్రధాన చర్చగా మారింది.

ఆయుష్ మలిక్ తన ధర్మ పరివర్తన విషయాన్ని కుటుంబానికి వెంటనే తెలియజేయకపోవడానికి కూడా ఒక కారణాన్ని వెల్లడిస్తున్నాడు. తన చెల్లి వివాహం వంటి కుటుంబ వ్యవహారాలకు ఎలాంటి ఆటంకం కలగకూడదనే ఉద్దేశంతోనే ఆ విషయాన్ని బహిర్గతం చేయలేదని ఆయన పేర్కొన్నారు. ఈ వివరణను అంగీకరించాలా వద్దా అన్నది వ్యక్తిగత అభిప్రాయానికి సంబంధించిన విషయం కావచ్చు. కానీ ఒక వ్యక్తి తన వ్యక్తిగత విశ్వాసాన్ని కొంతకాలం గోప్యంగా ఉంచుకోవడం అసాధారణం కాదు. ముఖ్యంగా కుటుంబ, సామాజిక ఒత్తిడులు అధికంగా ఉండే సమాజంలో అలాంటి ఉదాహరణలు సహజమే.

ఈ వ్యవహారంలో తరచుగా వినిపిస్తున్న మరో ఆరోపణ ఏమిటంటే, కోట్ల రూపాయల ఆస్తికి వారసుడైన ఆయుష్‌ను ప్రభావితం చేసి మతం మార్పించారనేది. కానీ ఈ వాదనకు ఆయుష్ ఇచ్చిన సమాధానం మరింత ఆసక్తికరంగా మారింది. తనకు ఆస్తిపై ఆసక్తి లేదని, కావాలంటే ఆస్తిని ఎవరిపేరైనా రాయవచ్చని, అవసరమైతే ఏదైనా సేవా సంస్థకు దానం చేయవచ్చని, తనకు ఒక్క రూపాయి కూడా అవసరం లేదని ఆయన బహిరంగంగా ప్రకటించారు. ఒక వ్యక్తి స్వయంగా ఆస్తిని త్యజించడానికి సిద్ధంగా ఉన్నానని చెబుతున్నప్పుడు, కేవలం ఆస్తి కోసమే అతన్ని మతం మార్చే ప్రయత్నాలు జరిగాయని ఆరోపించడం అన్యాయమే అవుతుంది.

దీనికి సంబంధించి దేశవ్యాప్తంగా వ్యాపింపజేస్తున్న అపోహలు, అబద్ధపు ప్రచారాలు వారి బతుకును దుర్భరం చేసివేశాయి. ఇది భారత రాజ్యాంగం హామీ ఇచ్చిన స్వేచ్ఛ గురించిన చర్చ. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రతి వ్యక్తికి గౌరవప్రదమైన జీవితం గడిపే హక్కును కల్పిస్తుంది. ఈ హక్కు కేవలం జీవించి ఉండే హక్కు మాత్రమే కాదు; తన జీవితానికి సంబంధించిన కీలక నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛను కూడా కలిగి ఉంటుంది. అదే విధంగా ఆర్టికల్ 25 ప్రతి పౌరుడికి తన ఇష్టానుసారం మతాన్ని అనుసరించే, ఆచరించే, ప్రచారం చేసే హక్కును కల్పిస్తుంది.

సుప్రీంకోర్టు కూడా అనేక సందర్భాల్లో వ్యక్తిగత స్వేచ్ఛకు అత్యున్నత ప్రాధాన్యత ఇచ్చింది. హదియా (షఫిన్ జహాన్ వర్సెస్ అశోకన్ కె.ఎం.) కేసు సహా అనేక తీర్పుల్లో సుప్రీంకోర్టు, వయోజన మహిళ లేదా పురుషుడు తనకు నచ్చిన వ్యక్తిని వివాహం చేసుకోవడం, నచ్చిన మతాన్ని ఎంచుకోవడం రాజ్యాంగబద్ధ హక్కు అని స్పష్టం చేసింది. కుటుంబ సభ్యులు, సమాజం లేదా ప్రభుత్వం ఆ హక్కులను అడ్డుకోవడంగాని, పరిమితం చేయడంగాని చేయలేవని కూడా న్యాయస్థానాలు పేర్కొన్నాయి.

ఇక్కడ మరో కీలక అంశం ఉంది. భారత న్యాయవ్యవస్థలో ప్రతి వ్యక్తి నిర్దోషి అన్నదే ప్రాథమిక సూత్రం. నేరం జరిగినట్లు కోర్టు నిర్ధారించే వరకు ఎవరినీ నేరస్తులుగా పరిగణించరాదు. ఈ నేపథ్యంలో చాంద్నీ ఖురైషీ, ఆమె తల్లిదండ్రులు లేదా ఇతర కుటుంబ సభ్యులపై వచ్చిన ఆరోపణలు కూడా విచారణ ద్వారానే నిర్ధారణ కావాలి. కేవలం ఆరోపణలు వచ్చినందుకు వారిని సామాజికంగా అవమానించడం, మీడియా విచారణల ద్వారా ముందుగానే తీర్పు చెప్పడం న్యాయసూత్రాలకు విరుద్ధం.

దురదృష్టవశాత్తు ఇటీవలి కాలంలో మతాంతర వివాహాలు తరచుగా రాజకీయ, సామాజిక వివాదాల కేంద్రంగా మారుతున్నాయి. ఇద్దరు వయోజనులు పరస్పర అంగీకారంతో వివాహం చేసుకున్నప్పటికీ, వారి నిర్ణయాలను అనుమానంతో చూసే ధోరణి పెరుగుతోంది. ఫలితంగా వ్యక్తిగత జీవితాలకు సంబంధించిన అంశాలు కూడా ప్రజా చర్చలుగా మారుతున్నాయి. ఇది కేవలం ఒక మతానికి లేదా ఒక సమాజానికి సంబంధించిన సమస్య కాదు. భవిష్యత్తులో ఏ వ్యక్తికైనా, ఏ కుటుంబానికైనా ఎదురయ్యే పరిస్థితి.

ప్రజాస్వామ్యం అంటే కేవలం ఎన్నికలు కాదు. ప్రజాస్వామ్యం అంటే వ్యక్తి స్వేచ్ఛకు గౌరవం. మెజారిటీ అభిప్రాయం భిన్నమైన జీవిత నిర్ణయాలను అంగీకరించకపోయినా, వారి నిర్ణయ హక్కును గౌరవించడం. ఒక వ్యక్తి చేసిన ఎంపిక మనకు నచ్చకపోవచ్చు. కానీ అతనికి ఆ ఎంపిక చేసే హక్కు ఉందనే విషయాన్ని అంగీకరించడం ప్రజాస్వామ్య సంస్కృతికి మూలాధారం.

ఈ నేపథ్యంలో ఆయుష్ మలిక్ చేసిన ప్రకటనలు ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకుంటాయి. తన మతాన్ని స్వయంగా ఎంచుకున్నానని, తన వివాహం తన స్వంత నిర్ణయమని, తనపై ఎలాంటి బలవంతం జరగలేదని, ఆస్తి తనకు అవసరం లేదని ఆయన బహిరంగంగా చెబుతున్నప్పుడు, ఆయన మాట వినడం కూడా అవసరం. వ్యక్తిగత స్వేచ్ఛ గురించి మాట్లాడేటప్పుడు వ్యక్తి స్వయంగా ఏమి చెబుతున్నాడో దానికంటే ముఖ్యమైన ఆధారం మరొకటి ఉండదు.

ఈ కేసులో అంతిమ సత్యం కోర్టుల ద్వారా, చట్టపరమైన ప్రక్రియల ద్వారా వెలుగులోకి రావాలి. ఒకవేళ మోసం, బలవంతం లేదా చట్టవ్యతిరేక చర్యలకు ఆధారాలు ఉంటే చట్టం తన పని చేయాలి. కానీ అలాంటి ఆధారాలు నిరూపితం కాకముందే వ్యక్తులపై ముద్ర వేయడం, వారి కుటుంబాలను వేధించడం, వారి రాజ్యాంగ హక్కులను పరిమితం చేయడం న్యాయబద్ధమైన సమాజ లక్షణం కాదు.

అంతిమంగా ఈ కేసు మనకు ఒక పెద్ద ప్రశ్నను మిగులుస్తోంది. భారత రాజ్యాంగం పౌరుడికి ఇచ్చిన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు నిజంగా అందరికీ సమానంగా వర్తిస్తున్నాయా? ఒక వ్యక్తి తన మతాన్ని, తన జీవిత భాగస్వామిని, తన జీవన విధానాన్ని ఎంచుకునే హక్కు కేవలం పుస్తకాలకే పరిమితమై ఉందా? లేక ఆ హక్కులను ఆచరణలో కూడా రక్షించగలమా?

ఆ ప్రశ్నకు సమాధానం కేవలం ఆయుష్ మలిక్, చాంద్నీ ఖురైషీల భవిష్యత్తును మాత్రమే నిర్ణయించదు. భారత ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, వ్యక్తిగత స్వేచ్ఛల పట్ల మన సమాజం ఎంత నిబద్ధతతో ఉందో కూడా నిర్ధారిస్తుంది. అందుకే ఈ వ్యవహారంలో భావోద్వేగాలకన్నా వాస్తవాలు, పుకార్లకన్నా ఆధారాలు, సామాజిక ఒత్తిడికన్నా రాజ్యాంగ విలువలే మార్గదర్శకంగా నిలవాలి. అదే నిజమైన న్యాయం. అదే ప్రజాస్వామ్యానికి తగిన ప్రమాణం.



# ప్రకృతి చాలా ఇస్తుంది... మరి మీరు?

డా. ముహమ్మద్ హసన్ *అసిస్టెంట్ ప్రొఫెసర్*

**ఒక జట్టులోని ఐదుగురు సభ్యులు సాయంత్రం వేళలో ఒక రెస్టారెంట్‌లో కూర్చొని భోజనం చేస్తున్నారు. అప్పుడు చల్లటి గాలి వీస్తోంది. ఆకస్మాత్తుగా సన్నటి వర్షపు జల్లు మొదలై, అది కాస్తా భారీ వర్షంగా మారింది. ఆ ఐదుగురిలో ఆ జట్టు నాయకుడు కూడా ఉన్నాడు. అతడు తన మనస్సులో "ఈ నలుగురికి ఒక మంచి పాఠం నేర్పాలి" అని అనుకుంటాడు. వెంటనే వారితో.. "మీరు నలుగురూ చేతులు కడుక్కొని నా వద్దకు రండి, ఒక ఆట ఆడుకుందాం" అంటాడు. వారు చేతులు శుభ్రం చేసుకోవడానికి వెళ్తారు.**

ఈ లోపు జట్టు నాయకుడు టేబుల్‌పైన కొన్ని వస్తువులను సిద్ధం చేశాడు. అందులో మొదటిది చెంచా (Spoon), రెండవది గ్లాసు (Glass), మూడవది మగ్గు (Mug), నాల్గవది బకెట్ (Bucket). ఇంతలో ఆ నలుగురూ చేతులు శుభ్రం చేసుకొని నాయకుడి వద్దకు వచ్చారు. ఇప్పుడు తాము ఏం చేయాలో చెప్పమని నాయకుడిని అడుగుతారు.

వారి మాటలు విన్న నాయకుడు టేబుల్ మీద ఉన్న ఆ నాలుగు వస్తువులను చూపించి, "వీటిని తీసుకొని బయటకు వెళ్లి, కురుస్తున్న వర్షపు నీటిని ఇందులో నింపుకొని రండి" అని చెబుతాడు. ఆ నలుగురూ ఆ నాలుగు వస్తువులను తీసుకొని వర్షంలోకి వెళ్లారు. తమ వద్ద ఉన్న వస్తువులతో కురుస్తున్న వర్షాన్ని పట్టుకోవడానికి ప్రయత్నించారు.

అందులో చెంచా (Spoon) తీసుకున్న వ్యక్తి చేతిలో ఉన్న చెంచా క్షణాల్లో వర్షపు నీటితో నిండిపోయింది. అతడు వెంటనే నాయకుడి వద్దకు వచ్చేసాడు. రెండవ వ్యక్తి గ్లాసును, మూడవ వ్యక్తి మగ్గును, నాల్గవ వ్యక్తి బకెట్‌ను నీటితో నింపుకొని నాయకుడి వద్దకు వచ్చారు.

ఆ నలుగురిని చూసి జట్టు నాయకుడు ఇలా అన్నాడు: "ఇప్పుడు మీకు రెండు విషయాలు నేర్పిస్తాను.

మొదటిది: వర్షపు నీటిని పట్టుకోవడం కోసం మీరు వేర్వేరు వస్తువులను తీసుకెళ్లారు. మీ వద్ద ఉన్న పాత్రలు చిన్నవైనా, పెద్దవైనా. వర్షం మాత్రం అందరిపైనా ఒకే మోతాదులో కురిసింది. మీరు తెచ్చిన చెంచా, గ్లాసు, మగ్గు, బకెట్లలోని నీటి పరిమాణం.. ఆయా వస్తువుల పరిమాణాన్ని (సాఇఓవ) బట్టి నిండింది. ప్రకృతి ఇవ్వడానికి సిద్ధంగానే ఉంది, కానీ మీ వద్ద ఉన్న పాత్రే చిన్నదైతే ఇచ్చేవాడు మాత్రం ఏం చేయగలడు?

ఇక రెండవ పాఠం: పెద్ద పాత్ర నిండడానికి ఎక్కువ సమయం పడుతుంది. ఎంత తక్కువ సమయంలో చెంచా నీటితో నిండిందో, అంతే వేగంగా బకెట్ నిండదు. కాబట్టి మీరు ఎక్కువ నీటిని నింపుకోవాలంటే, వర్షంలో తడుస్తూ బకెట్ నిండేంత వరకు ఓపికగా నిరీక్షించాల్సి ఉంటుంది.

మీరు జీవితంలో గొప్పగా ఎదగాలన్నా, రాణించాలన్నా మీ ప్రయత్నాలు కూడా ఇలాగే ఉండాలి. అందులో వచ్చే ఆటుపోట్లను తట్టుకొని నిలబడాలి. అలా అయితేనే మీరు విజయం సాధిస్తారు; లేనిపక్షంలో ఓటమిని చవిచూడాల్సి వస్తుంది. ఈ ప్రకృతిలో మీరు తీసుకోవడానికి ఎంతో ఉంది, కానీ మీరు సిద్ధంగా లేకపోతే ప్రకృతి మాత్రం మీకు ఏమి ఇవ్వగలదు? మీరు మీ ఇంటి నాలుగు గోడల మధ్య కూర్చొని ఏదో సాధిం చాలనుకుంటే ఏదీ సాధ్యం కాదు.

“మీ ఆలోచనలు నీటి ప్రవాహం మాదిరిగా పరుగులు తీస్తే ఏదైనా సాధ్యమే”.

అదే నీరు ఒకే చోట ఆగిపోతే అందులో బ్యాక్టీరియా, వైరస్ చేరి కలుషితమవుతుంది. మన మెదడు కూడా అంతే! ఎప్పటి కప్పుడు కొత్త కొత్త ఆలోచనలతో దానికి పని కల్పిస్తే, అది కూడా అంతే వేగంగా స్పందిస్తుంది. మీరు దానికి ఏ పనీ చెప్పక పోతే, మీ మెదడు మొద్దుబారిపోయి స్తబ్దంగా ఉండి పోతుంది.

చివరగా ఒక ప్రశ్న.. మీ ఇంటి పరిసరాలలో ఉన్న చెట్టు ఎంత ఎత్తు ఎదుగుతుందో గమనించారా? అది తన చివరి స్థాయి వరకు ఎదుగుతుంది కానీ మధ్యలో ఎక్కడా పెరుగుదల ఆపదు. ఒక వృక్షం పైకి ఎంత విశాలంగా విస్తరిస్తుందో, దాని వేర్లు కూడా భూమిలో అంతకంటే బలంగా, విశాలంగా విస్తరిస్తాయి. అవే దానికి కావలసిన బలాన్ని ఇస్తాయి. అలాగే ఒక వృక్షం తన స్థాయికి తగ్గట్టుగా ఎన్ని పండ్లను ఇవ్వాలో అన్నే ఇస్తుంది కానీ, ఎట్టి పరిస్థితుల్లోనూ తక్కువగా ఇవ్వదు.

మరి మీరు మీ లక్ష్యం పట్ల అంత శ్రద్ధ పెడుతున్నారా? ఒకవేళ మీరు అలాంటి శ్రద్ధ పెడితే మీకు ప్రకృతి ఆశీస్సులు లభిస్తాయి; ఒకవేళ పెట్టకపోతే ఒక్కసారి ఆలోచించండి. లేవండి, ఇంకా శ్రమించండి! మీరు చేసే పని మీపై మీకే నమ్మకం కలిగించేలా ఉండాలి. సింహంతో ఉంటే జీవితంలో పోరాడటం నేర్చుకో వచ్చు, అదే గాడిదతో ఉంటే పరిస్థితులకు లొంగిపోవడం అలవాటవుతుంది.


ఓటమి అనేది కేవలం ఒక క్షణం మాత్రమే ప్రభావితం చేస్తుంది. సంకల్ప బలం ఉన్నవారిపై అది పెద్దగా ప్రభావం చూపలేదు. వెంటనే వారు ఆ ఓటమి నుండి తేరుకొని, బయటపడి మళ్లీ ప్రయత్నాలు ప్రారంభిస్తారు. కానీ కొద్దిమంది మాత్రం అలాగే నిరాశకు లోనై అందులోనే కూరుకుపోతారు. ఆ సమయంలో మీరు ఎవరి ఓదార్పుల కోసమో ఎదురుచూడకండి.. కాస్త నిరీక్షిస్తే పరిస్థితులన్నీ మీకు అనుకూలంగా మారుతాయి. ఈ కథ మీ జీవితంలో విశేషమైన ప్రభావం చూపుతుందని ఆశిస్తున్నాను.

*(త్వరలో రాబోతున్న “మిమ్మల్ని మీరు తెలుసుకోండి” – వ్యక్తిత్వ వికాసం పుస్తకం నుండి)*


సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

## ముఖ్య ఆశయాలు

- సమాజంలో ప్రజాస్వామ్య విలువలు సర్వసామాన్యం కావడానికి, మానవుల మధ్య సోదరభావం పెంపొందడానికి, అంటరానితనం, నిమ్నోన్నతలూ, భేదభావాలు సమసిపోవడానికి, సాంఘిక న్యాయం నెలకొనడానికి ప్రజాచైతన్యాన్ని మేల్కొల్పడం.
- ముస్లిములు ముస్లిమేతరుల మధ్య సదవగాహన, సామరస్యం ఏర్పరచే వారధిని సృష్టించడం.
- ఇస్లాం, ముస్లింలు, ఇస్లామీయ ఉద్యమం గురించి ఏర్పడి ఉన్న అపార్థాలను, అపోహలను తొలగించటం.
- ఇస్లాం యొక్క నిజమైన బోధనల్ని ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా ప్రజలందరికీ తెలియజేయడం.




**ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ముస్లింల కాలగణనకు ప్రామాణికం.. ఇస్లామీయ సంస్కృతికి అద్దం పట్టే సజీవ సాక్ష్యం.. 'హిజ్రీ క్యాలెండర్'. లోక కల్యాణం కోసం, దైవధర్మ రక్షణ కోసం సర్వస్వాన్నీ త్యాగం చేసిన ఒక మహాప్రస్థానానికి ఇది చారిత్రక వారసత్వం. జగత్ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి జీవితంలో చోటుచేసుకున్న 'హిజ్రత్' (వలస) అనే అద్వితీయ ఘట్టం ఆధారంగా రూపుదిద్దుకున్న ఈ క్యాలెండర్ వెనుక ఉన్న త్యాగాల కథనం, ఇస్లామీయ ఆత్మగౌరవ ప్రతీకలు ఈ వారం ప్రత్యేక కథనంలో...**

- తహూరా సిద్దీఖా

## హిజ్రత్ అంటే ఏమిటి?

అరబీ భాషలో "హిజ్ర్" అంటే పరిత్యజించడం లేదా వదిలి వేయడం అని అర్థం. దీని నుంచే 'హిజ్రత్' అనే పదం ఉద్భవించింది. ఇస్లామీయ పరిభాషలో తన సత్య విశ్వాసాన్ని (ఈమాన్) సంరక్షించుకోవడానికి లేదా దైవధర్మ ప్రచారార్థం స్వదేశాన్ని వీడి వలస వెళ్ళడాన్ని "హిజ్రత్" అంటారు.

ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో "వలసదారులు" (Immigrants) అనేది ఒక అంతర్జాతీయ పదం. ప్రతి దేశంలోనూ వలసదారులు ఉన్నారు, ముఖ్యంగా అగ్రదేశాలలో వీరి సంఖ్య మరీ ఎక్కువ. అయితే, వీరంతా ఆర్థిక పురోభివృద్ధి కోసమో లేదా రాజకీయ ప్రయోజనాల కోసమో తమ మాతృభూమిని వదిలిపెట్టినవారే గానీ త్యాగధనులు కారు. కాబట్టి, కేవలం ప్రాపంచిక లబ్ధి కోసం వలస వెళ్ళినవారిని 'ముహాజిరిన్' (హిజ్రత్ చేసినవారు) అని పిలవడం 'హిజ్రత్' అనే పవిత్రమైన పదానికి, దాని వెనుక ఉన్న మహోన్నత ఆశయానికి అన్యాయం చేయడమే అవుతుంది.

## ప్రవక్తల ఆనవాయితీ (సున్నత్)

హిజ్రత్ అనేది వాస్తవానికి ప్రవక్తల పరంపరలో వస్తున్న ఒక ఉదాత్తమైన ఆనవాయితీ. దైవధర్మ గమ్యంలో హిజ్రత్ చేయని ప్రవక్త అంటూ చరిత్రలో దాదాపు ఎవరూ లేరు. హజ్రత్ ఇబ్రాహీమ్ (అలైహిస్సలాం), హజ్రత్ మూసా (అలైహిస్సలాం),

హజ్రత్ లూత్ (అలైహిస్సలాం) మొదలైన ప్రవక్తల హిజ్రత్ గాథలను పవిత్ర ఖురాన్ స్వయంగా ప్రస్తావించింది. కానీ, విశ్వ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి హిజ్రత్‌కు లభించినంత ఖ్యాతి, చారిత్రక ప్రాధాన్యత మరే ఇతర ప్రవక్త వలసకూ లభించలేదు.

ప్రవక్త ముహమ్మద్ (స) గారు క్రీ.శ. 571 లో జన్మించారు. సరిగ్గా 40 సంవత్సరాల ప్రాయంలో, అంటే క్రీ.శ. 611 లో ఆయనకు ప్రవక్త పదవి (నబువ్వత్) లభించింది. అంతకుముందు నుంచే ఆయన సత్యసంధత, నమ్మకత్వం, నిష్కళంకమైన ఉత్తమ నైతిక విలువల గురించి మక్కా నగరమంతటా ప్రశంసల జల్లు కురిసేది. ఆయన తన బాల్యాన్ని, యవ్వనాన్ని అదే మక్కా వీధుల్లో గడిపారు. ఎప్పుడైతే ఆయనకు ప్రవక్త పదవి లభించిందో, అప్పటి నుండి అజ్ఞానాంధకారంలో ఉన్న ప్రజలు ఆయనను అనేక రకాలుగా వేధించడం ప్రారంభించారు. అయినప్పటికీ, ఆయన శీలాన్ని వేలెత్తి చూపించే ఒక్క వేలు గానీ, ఆయన పవిత్ర జీవితాన్ని, ప్రామాణికతను తప్పుపట్టే ఒక్క నోరు గానీ ఆ నగరంలో లేకపోవడం విశేషం.

## మక్కాలో ధర్మప్రచారం - కష్టాల కడలి

ఆయన మక్కా నగరంలో 13 సంవత్సరాల పాటు దైవధర్మ ప్రచారం కోసం అహర్నిశలూ శ్రమించారు. దేవుని సృష్టి ఎలాగైనా సత్యాన్ని గ్రహించి, సన్మార్గంలో పయనించాలని రాత్రింబగళ్లు ఆయన హృదయం తపించేది. రోజంతా మక్కా సందులలో, బజార్లలో తిరుగుతూ ప్రజలను ఇస్లాం వైపునకు ఆహ్వానించేవారు. ప్రతి ఇంటి తలుపు తడుతూ, సుప్తావస్థలో ఉన్న మానవ హృదయాలను మేల్కొల్పడానికి ప్రయత్నించేవారు.

కానీ, ఆ సత్యవాణిని స్వీకరించిన వారు తొలినాళ్లలో చాలా తక్కువ మంది మాత్రమే. సత్యం వెలుగు మధ్యాహ్న సూర్యుడిలా ప్రకాశిస్తున్నప్పటికీ, మెజారిటీ ప్రజలు తమ పూర్వీకుల అంధవిశ్వాసాలను, విగ్రహారాధనను, అధర్మాన్ని వదిలిపెట్టడానికి సిద్ధపడలేదు.

## అమానుషత్వానికి పరాకాష్ట

ఈ కాలంలో ప్రవక్త (స) గారికి జరగని అన్యాయం, అవమానం లేదు. ఆయనను, ఆయన కుటుంబసభ్యులను సామాజికంగా బహిష్కరించారు. ముస్లింలు కడుపు నింపుకోవడానికి అన్నం లేక అలమటించారు. ప్రవక్త (స), వారి అనుచరులు చెట్ల ఆకులను, బెరడులను తిని ప్రాణాలు నిలుపుకోవాల్సి వచ్చింది. ఆయన కాబా ప్రాంగణంలో నమాజ్ చేస్తున్నప్పుడు ఆయన పవిత్ర శరీరంపై ఒంటె పేగులను, కుళ్ళిన వ్యర్థాలను తెచ్చి పడేశారు. నడిచే దారిలో ముళ్ళు చల్లారు. చివరకు ఆయనను పిచ్చివాడని, మంత్రగాడని దుష్ప్రచారం చేశారు.

## తాయిఫ్ పర్యటన - హృదయ విదారక ప్రార్థన

ప్రవక్త పదవి లభించిన పదో సంవత్సరంలో ఆయన తాయిఫ్ నగరం వైపు పయనించారు- బహుశా అక్కడి ప్రజలైనా ఇస్లాం భాగ్యానికి నోచుకుంటారేమోనని! కానీ తాయిఫ్ నేల మక్కా కంటే కఠినమైనదిగా, క్రూరమైనదిగా నిరూపితమైంది. అక్కడి వారు ఇస్లాంను తిరస్కరించడమే కాకుండా, కరుణామయుడైన ప్రవక్త (స) గారి వెనుక ఆకతాయిలను, వీధి బాలురను ఉసిగొల్పారు.

ఆ రాళ్ల దెబ్బలకు ప్రవక్త(స) పవిత్ర శరీరం రక్తసిక్తమైంది. కారుతున్న రక్తం ఆయన పాదరక్షలలో గడ్డకట్టిపోయింది. మోకాళ్లు గాయపడ్డాయి.

అంతటి భగ్న హృదయంతో, కన్నీటి ధారలతో ప్రవక్త (స) అల్లాహ్ వైపునకు మొరపెట్టుకుంటూ చేసిన ఆ హృదయ విదారక ప్రార్థన (దుఆ) చరిత్రలో నిలిచిపోయింది:

"ఓ అల్లాహ్! నా బలహీనతను, నా నిస్సహాయతను, ప్రజల దృష్టిలో నాకున్న అల్పత్వాన్ని నీ ముందే నివేదించుకుంటున్నాను. నువ్వే కరుణించే వారిలో కెల్లా గొప్ప కరుణామయుడివి. దిక్కులేని అభాగ్యులకు నీవే రక్షకుడవు... ఒకవేళ నాపై నీకు ఎలాంటి ఆగ్రహం లేకపోతే, నాకు దేని గురించీ చింత లేదు. నాకు నీ సంతృప్తి, నీ సమ్మతి మాత్రమే కావాలి. నీవు తప్ప మరెవ్వరి దగ్గరా ఎలాంటి శక్తి సామర్థ్యాలు లేవు."

## మదీనా ప్రజల హృదయాలలో ఇస్లాం అంకురార్పణ

దైవలీలల వైచిత్రి ఎంతో అద్భుతమైనది! ప్రవక్త ముహమ్మద్(స) గారు విశ్వాసం (ఈమాన్) అనే ఏ పవిత్ర విత్తనాన్నయితే మక్కా, తాయిఫ్ నేలపై నాటారో, అల్లాహ్ దాని ద్వారా మదీనా ప్రజల (అన్సార్ల) హృదయాలను ఫలవంతం చేశాడు. వర్షం ఒకచోట కురుస్తుంటే, ఈమాన్ అనే అమృతం మరొకచోట నిలువ చేయబడుతున్నట్లుగా ఈ అద్భుతం జరిగింది.

హజ్ సందర్భంలో మదీనా ప్రజలు మక్కాకు వచ్చినప్పుడు, వారి చెవులు ప్రవక్త (స) గారి ధర్మప్రచారం వైపు ఆకర్షించబడ్డాయి. వారు ఎంతో నిష్కపటులు, సత్యాన్వేషకులు కావడం వల్ల వెంటనే ఇస్లాంను స్వీకరించారు; అంతేకాకుండా ముస్లింలకు తమ నగరంలో ఆశ్రయం కల్పిస్తామని, ప్రాణాలొడ్డి రక్షిస్తామని ప్రమాణం (బైఅత్) కూడా చేశారు.

## ముస్లింలపై ముదిరిన అత్యాచారాలు

మరోవైపు మక్కా నగరం ముస్లింలకు రోజురోజుకూ నరక ప్రాయంగా మారుతోంది. కొంతమంది ముస్లింల మెడకు తాడు బిగించి, మండుతున్న ఎండలో కాలుతున్న ఇసుకపై ఈడ్చుకెళ్లే

వారు. ఇంకొంతమందిని నిప్పు కణికలపై పడుకోబెట్టేవారు; వారి శరీరాల నుండి కారే రక్తం, కొవ్వు వల్ల ఆ నిప్పు ఆరిపోయేదంటే వారిపై జరిగిన అమానుషత్వం ఎంతటిదో అర్థం చేసుకోవచ్చు.

అయినప్పటికీ, ముస్లింలు తమ ఓర్పు (సబర్) ను కోల్పోలేదు. చివరికి అల్లాహ్ తరపున ముస్లింలందరూ మక్కాను విడిచి మదీనాకు తరలివెళ్ళవలసిందిగా ఆజ్ఞ వెలువడింది. దాంతో ముస్లింలు నెమ్మదిగా మదీనాకు వలస వెళ్ళడం ప్రారంభించారు.

## మక్కా నుండి హిజ్రత్ (మహాప్రస్థానం)

ఇస్లాం శత్రువులు ప్రవక్త (స) గారిని శాశ్వతంగా హతమార్చడానికి ఒక ఘోర పన్నాగం పన్నారు. ప్రతి తెగ నుండి ఒక క్రూర ప్రతినిధిని ఎన్నుకొని, రాత్రి వేళ ప్రవక్త గారి ఇంటిని చుట్టుముట్టారు. అదే సమయంలో అల్లాహ్ ప్రవక్త(స) గారికి ఆ కుట్రను ముందుగానే వహీ (దైవ సందేశం) ద్వారా తెలియజేశాడు. ప్రవక్త(స) గారు పూర్తి ప్రశాంతతతో పవిత్ర ఖురాన్ (సూరహ్ యాసీన్) కొన్ని ఆయత్‌లను పఠిస్తూ, శత్రువుల కళ్ళు గప్పి బయటకు వచ్చేశారు.

శత్రువులు ప్రవక్త(స) గారి శిరస్సును తెచ్చిన వారికి భారీ బహుమతిని ప్రకటించారు. ప్రవక్త (స), ఆయన ఆత్మీయ మిత్రుడు హజ్రత్ అబూబకర్(ర) ల ప్రాణాలు తీయడానికి శత్రువులు తమ శాయశక్తులా ప్రయత్నించారు. కానీ దేవుని సంకల్పం ముందు వారి వ్యూహాలన్నీ తలకిందులయ్యాయి. మక్కాలో ఉదయించిన ఆ ప్రవక్త పదవి అనే భానుడు, మదీనాకు చేరుకుని మధ్యాహ్న సూర్యుడిలా జగద్విదితంగా ప్రకాశించాడు.

## మదీనాలో అద్భుత స్వాగతం

ప్రవక్త(స) గారు మదీనా పురవీధుల్లో అడుగుపెట్టినప్పుడు అక్కడొక పండుగ వాతావరణం నెలకొంది. తమ హృదయాలను, నయనాలను మురిపెంగా పరుస్తూ మార్గానికి ఇరువైపులా నిలబడ్డారు. వారి నోట 'తలా అల్ బద్రు అలైనా' అనే స్వాగత గీతాలు ఆలపించబడుతుంటే, మదీనా నగరం తన ప్రాణాన్ని సైతం వారి దారిలో పరచడానికి సిద్ధపడింది.

మక్కాలో సర్వస్వం కోల్పోయి వలస వచ్చిన ఆ 'ముహాజిరిన్' సమూహాలకు మదీనా ప్రజలు తమ ఇళ్లలో స్థానం ఇచ్చారు, ఆశ్రయం కల్పించారు, పొలాలు, తోటలను పంచి ఇచ్చారు. మదీనా ప్రజలు చూపిన ఈ నిరుపమాన త్యాగం (ఈసార్) మానవ చరిత్రలోనే మరెక్కడా కానరాని ఒక ఉదాత్తమైన ఉదాహరణ.

## ముహాజిరిన్ - అన్సార్ల అనుబంధం

ముస్లిం సమాజంలో ఈ రెండు వర్గాలు తప్ప మూడవ వర్గానికి తావు లేదు. అక్కడ కులాలు, వర్గాలు, తెగలు, ప్రాంతాలు, భాషలు అనే తేడాలు పూర్తిగా తుడిచిపెట్టుకుపోయాయి.

**ముహాజిరిన్** : ధర్మం కోసం, సత్య విశ్వాస సంరక్షణ కోసం స్వదేశాన్ని, ఆస్తులను త్యజించి వచ్చినవారు.

**అన్సార్** : వలస వచ్చిన ముస్లింలకు ఆశ్రయమిచ్చి, సర్వస్వం పంచి ఆదుకున్న మదీనా సహాయకులు.

## హిజ్రత్ ప్రాముఖ్యత, సందేశం

హిజ్రత్ అనే ఈ సంఘటన ఒకవైపు ముస్లింల అసమాన త్యాగాలను స్మరింపజేస్తే.. మరోవైపు, భవిష్యత్తులో ఇస్లాం సాధించబోయే విశ్వవిజయాలకు, సాఫల్యతలకు ఇది ఒక గట్టి పునాదిగా నిలిచింది. ఇది కేవలం ఒక సాదాసీదా ప్రయాణం కాదు; బంధనాల నుండి స్వేచ్ఛ వైపునకు, అణచివేత నుండి శక్తి, వైభవం వైపునకు సాగిన మహాప్రస్థానం. ఈ సంఘటన నిరాశలలో ఆశల కిరణాన్ని చూపిస్తుంది, నిరుత్సాహపరిచే పరిస్థితులలో ధైర్య దీపాన్ని వెలిగిస్తుంది.

## హిజ్రీ క్యాలెండర్ ప్రారంభం

హజ్రత్ ఉమర్ (ర) ఖలీఫాగా ఉన్న కాలంలో ఆయన ముందుకు ఒక అధికారిక పత్రం వచ్చింది. అందులో తేదీ, నెల ఉన్నాయి కానీ సంవత్సరం పేర్కొనబడలేదు. అప్పుడు ముస్లింలకంటూ సొంతంగా ఒక క్యాలెండర్ ఉండాలనే ఆలోచన ఆయనకు వచ్చింది. ఆయన ఈ ప్రతిపాదనను 'మజ్లిస్-ఎ-షూరా' (సలహా మండలి) ముందు ఉంచారు.

హజ్రత్ అలీ(ర) ఇచ్చిన అద్భుత సలహా మేరకు- ఇస్లామీయ క్యాలెండర్ 'హిజ్రత్' సంఘటన ఆధారంగానే ప్రారంభం కావాలని ఏకగ్రీవంగా నిర్ణయించారు.

నెలల క్రమం మాత్రం ఇస్లాంకు పూర్వం అరబ్బులలో ఎలా వాడుకలో ఉండేదో (ముహర్రంతో ప్రారంభమై జుల్ హిజ్జాతో

దళితుల, మహిళల ఆశల నిధి
అంబుల పొది
సహజీవన భావనల పొదరాయి
గేటురాయి
వారపత్రిక

ముగిసేలా) అలాగే ఉంచబడింది. కానీ, సంవత్సరాన్ని మాత్రం హిజ్రత్ జరిగిన ఏడాది నుండి లెక్కించడం ప్రారంభించారు.

### క్యాలెండర్: ఒక జాతి ఆత్మగౌరవం

ఏ క్యాలెండర్ అయినా ఒక జాతి స్వంత గుర్తింపుకు, సంస్కృతికి చిహ్నం. హిజ్రీ క్యాలెండర్‌ను గమనిస్తే, అందులోని చాలా నెలల పేర్లు ఇస్లామీయ ఆరాధనలను (ఇబాదత్), ముస్లింల మతపరమైన సంప్రదాయాలను సూచిస్తాయి.

ఇతర సమాజాలలో వాడుకలో ఉన్న క్యాలెండర్లు కూడా వారి వారి మతపరమైన ఆలోచనలను ప్రతిబింబిస్తాయి. ఉదాహరణకు: ఇంగ్లీష్ లో Sunday, Monday అనే పదాలను తీసుకుంటే.. వాటి అర్థం సూర్యుడి రోజు (Sunµs day), చంద్రుడి రోజు (Moonµs day). ప్రాచీన గ్రీకు, రోమన్ ప్రజలలో వివిధ పేర్ల మీదుగా రోజుల పేర్లను పెట్టారు. నెలల పేర్ల వెనుక కూడా ఇటువంటి పురాణ గాథలే దాగి ఉన్నాయి. ఇందువల్లనే, హజ్రత్ ఉమర్ (ర) ఆ కాలంలో వాడుకలో ఉన్న ఇతర క్యాలెండర్లను ముస్లింల గుర్తింపు కోసం అంగీకరించలేదు.

### మన బాధ్యత

ఇస్లామీయ క్యాలెండర్ అనేది ముస్లింల ప్రత్యేక గుర్తింపు, ఆత్మగౌరవం. కాబట్టి ఈ క్యాలెండర్‌ను మన దైనందిన జీవితంలో, వ్యవహారాలలో వాడుకలోకి తీసుకురావడం, రాబోయే తరాలకు దీని వెనుక ఉన్న నేపథ్యాన్ని తెలియజేయడం మనందరి ప్రాథమిక బాధ్యత.

# ప్రతి మనిషికి విద్యాజ్ఞానాలు ఎంతో అవసరం!



పవిత్రమైన ఇస్లాం విద్యాజ్ఞానాలకు ఎక్కువ ప్రాముఖ్యతనిచ్చింది. ముఖ్య కారణం విశ్వాసానికి మూలాధారం జ్ఞానం. మనిషి విశ్వాసం పటిష్టంగా కావాలంటే జ్ఞానాన్ని వీలైనంత ఎక్కువగా పొందాలి. మంచి గురువుల ద్వారా జ్ఞానాన్ని అర్థించాలి. మనం పొందిన జ్ఞానాన్ని ఇతరులకు పంచాలి. దానిద్వారా సమాజంలో మంచి మార్పు కనబడుతుంది. మనిషిలో క్రమశిక్షణ, మాట్లాడే పద్ధతి, పెద్దల గౌరవం, చిన్న పిల్లలపై ప్రేమ, ఇరుగు పొరుగు వారితో కలిసి ఉండడం, స్నేహితులతో మంచిగా ఉండడం, బంధువులతో బంధుత్వాన్ని నెరవేర్చడం వంటి అతని జీవితాన్ని మార్చి మహోన్నతమైన వ్యక్తిగా, ఆదర్శవంతమైన పౌరునిగా రూపొందిస్తుంది. అటువంటి మనిషికి సమాజం మంచి గుర్తింపునిస్తుంది.

అజ్ఞానం మనిషిని అంధకారంలో బంధించి అనాగరికుడ్ని చేస్తుంది. అజ్ఞానం వల్ల మనిషి కొన్ని చోట్ల తడబడతాడు, భయపడతాడు, వెనుకబడిపోతాడు. పది మందిలో మాట్లాడటానికి జంకుతాడు. సిగ్గుతో తలవంచుతాడు. ఇవన్నీ ఊహించుకొని వెనుకడుగు వేయడానికి ప్రయత్నిస్తాడు. ఇతరులపై భారం వేసి తనను తాను పక్కకు వైదొలుగుతాడు. ఎందుకంటే నా దగ్గర అంత జ్ఞానం లేదు అని సమాధానం ఇవ్వడానికి ప్రయత్నంచేస్తాడు.

జ్ఞానం మానవుని ప్రగతి వికాసాలకు రాచబాటలు నిర్మిస్తుంది. అత్యున్నత నాగరికతా సంస్కృతులకు గట్టి పునాదులు వేస్తుంది. పునాదులపైనే మనిషి నిర్మాణానికి దృఢమైన బలం లభిస్తుంది.

పూర్వకాలంలో జ్ఞానార్జన చేసే అవకాశం అగ్రవర్ణాల వారికి, సంపద కలిగి ఉన్నవారికి మాత్రమే పరిమితమై ఉండేది. ఆ కాలంలో స్త్రీలకు విద్య నేర్చుకునే అవకాశం ఉండేది కాదు. ఉంటే వేళ్ళ మీద లెక్కించవచ్చు.

అంతిమ దివ్య ఖుర్ఆన్ ప్రకారం ఆది మానవుడైన హజ్రత్ ఆదం(అ)కు దైవదూతలపై 'ఆధిక్యత' కేవలం ఈ జ్ఞానం వల్లనే ఇవ్వబడిందని మనకు ప్రస్ఫుటంగా తెలుస్తుంది. మరోచోట దివ్య ఖుర్ఆన్‌లో 'చదువు' గురించి అల్లాహ్ ఈ విధంగా తెలిపాడు :"చదువు! సమస్తాన్నీ సృష్టించిన నీ ప్రభువు పేరుతో, ఆయన పేరుకుపోయిన నెత్తుటి ముద్దతో మనిషిని సృష్టించాడు. చదువు! నీ ప్రభువు పరమ దయామయుడు. ఆయన కలం ద్వారా విద్య నేర్పాడు. మనిషి ఎరుగని జ్ఞానాన్ని అతనికి ప్రసాదించాడు. (దివ్య ఖుర్ఆన్ 96: 1-5)

ఇవి దివ్య ఖుర్ఆన్ అవతరణ యొక్క మొట్టమొదటి వాక్యాలు. ఇవి- విద్య అవసరాన్ని తెలుపుతున్నాయి. అనాగరిక మనుషులు- నాగరికులుగా మారడానికి విద్య అవసరమని సూచిస్తున్నాయి. ఆటవిక సమాజం- ఆధునిక సమాజంగా మారడానికి విద్య అవసరమని మరీ చెబుతున్నాయి.

"మీరు జ్ఞానాన్ని ఆర్జించే ప్రయత్నం చేయండి. అది చైనా లాంటి సుదూర దేశంలో లభించినా సరే" అని అంతిమ దైవప్రవక్త ముహమ్మద్(స) అన్నారు.

సృష్టికర్త అందరికీ విద్య పరమార్థాన్ని గుర్తించే అవగాహనను ప్రసాదించుగాక!

**- ముహమ్మద్ వహీదుద్దీన్, సిద్దిపేట**




**గతసంచిక తరువాయి**

### ఖురాన్ దృక్పథం

ఇతర మతాల సాంప్రదాయక వైఖరితో పోలిస్తే పవిత్ర ఖురాన్ దృక్పథం పూర్తిగా భిన్నమైనది. ఖురాన్ మనుషులను ప్రశ్నలు అడగమని, ఈ అనంత విశ్వాన్ని నిశితంగా పరిశీలించి ఆలోచించ మని ప్రోత్సహిస్తుంది. ప్రజలు ఎలాంటి ఆలోచనా, అవగాహనా లేకుండా గుడ్డిగా విశ్వసించడాన్ని ఖురాన్ ఎంతమాత్రం ఇష్టపడదు. ఖురాన్ తార్కిక శైలి, అది ఇచ్చే ఆలోచనా నియంత్రణ ఈ క్రింది దైవవాక్యం ద్వారా స్పష్టమవుతుంది:

"(ప్రవక్త మాటలను విశ్వసించకుండా) తిరస్కరించిన వారు ఈ విషయాలను గురించి ఆలోచించరా ఆకాశాలూ భూమీ పరస్పరం కలసి ఉండేవనీ, తరువాత మేము వాటిని వేరు చేశామనీ, ప్రాణం ఉన్న ప్రతిదానిని నీళ్లతో సృష్టించామనీ? వారు (సృష్టించే మా ఈ శక్తిని)విశ్వసించరా?" (సూరహ్ అల్-అంబియా: 30)

ఖురాన్ వాక్యాలను అర్థం చేసుకుంటూ, వాటిపై వివేకంతో ఆలోచించి, స్పృహతో కూడిన విశ్వాసాన్ని కలిగి ఉండాలని ఖురాన్ స్వయంగా ఇలా చెబుతోంది:

"వారికి తమ ప్రభువు ఆయతులను వినిపించి హితబోధ చేయటం జరిగితే, వారు దానిని గురించి అంధులుగా, చెవిటి వారుగా ఉండిపోరు." (సూరహ్ అల్-ఫుర్కాన్: 73)

మరొక చోట ఇలా ప్రశ్నించడం జరిగింది: "వారు ఖురాన్‌ను గురించి ఆలోచించలేదా? లేక వారి హృదయా లకు తాళాలు పడి ఉన్నాయా?" (సూరహ్ ముహమ్మద్: 24)

పవిత్ర ఖురాన్ స్పష్టమైన వాక్యాల ద్వారా ఒక విషయం నిరూపిత మవుతోంది- శాస్త్రీయ నియమాలను (Scientific Laws) కనుగొనడం అనేది దేవుణ్ణి తిరస్కరించడానికి ఆధారం కాదు; బదులుగా అది ఆ సృష్టికర్త ఉనికికి, ఆయన అపారమైన శక్తికి , వివేకానికి సజీవ సాక్ష్యం. ఎందుకంటే, ఎక్కడైనా ఒక 'నియమం' (Law) ఉందంటే.. అది ఖచ్చితంగా ఆ నియమాన్ని తయారుచేసిన వాడు (Lawmaker) ఉన్నాడనే విషయాన్ని సూచిస్తుంది.

### 4. దేవుని ఉనికికి సజీవ సాక్ష్యాలు

సైన్స్ సాధించిన ప్రగతి వల్ల కలిగిన అత్యంత విస్మయకరమైన ప్రభావం ఇది. మనిషి ఈ విశ్వం గురించి ఎంతగా జ్ఞానాన్ని సంపాదించుకుంటూ వెళ్తున్నాడో, దేవుని ఉనికిని నిరూపించే ఆధారాలు అంతగా స్పష్టమవుతున్నాయి. ఒకప్పుడు ఈ విశ్వం ఎల్లప్పుడూ ఇలాగే ఉంటూ వచ్చిందని (అనంతమైనదని)

భావించే వారు. కానీ ఆధునిక సైన్స్ ఈ విశ్వానికి ఒక నిర్దిష్టమైన 'ప్రారంభం' ఉందనే విషయాన్ని నిరూపించింది. 'బిగ్ బ్యాంగ్ థియరీ' (Big Bang Theory) ప్రకారం, ఈ విశ్వమంతా ఒకే ఒక్క సూక్ష్మ బిందువు నుండి ఉద్భవించింది, ఇది నిరంతరం విస్తరిస్తూనే (వ్యాకుతూనే) ఉంది.

ఈ మహా విస్ఫోటనం గురించి పవిత్ర ఖురాన్ 1400 సంవత్సరాల ముందే ఇలా ప్రకటించింది:

"(ప్రవక్త మాటలను విశ్వసించకుండా) తిరస్కరించిన వారు ఈ విషయాలను గురించి ఆలోచించరా ఆకాశాలూ భూమీ పరస్పరం కలసి ఉండేవనీ, తరువాత మేము వాటిని వేరు చేశామనీ" (సూరహ్ అల్-అంబియా: 30)

విశ్వం నిరంతరం విస్తరించడం గురించి మరొక చోట ఇలా చెప్పబడింది:

"మేము ఆకాశాన్ని స్వశక్తితో నిర్మించాము. మేము అలా చేసే సామర్థ్యం కలిగి ఉన్నాము." (అజ్-జారియాత్: 47)

శాస్త్రవేత్తల ప్రకారం, విశ్వం యొక్క ప్రాథమిక నియమాలు, స్థిరాంకాలు (Physical Constants) ఎంతటి సునిశితమైన సమతుల్యతపై (Fine-Tuning) ఆధారపడి ఉన్నాయంటే, వాటిలో ఒక రవ్వంత మార్పు వచ్చినా ఇక్కడ జీవం అనేది అసాధ్యంగా మారిపోతుంది. ఈ అద్భుతమైన సమతుల్యత--- విశ్వం వెనుక ఒక అత్యున్నతమైన ప్రణాళిక (Grand Design) ఉందనే విషయానికి స్పష్టమైన సంకేతం.

అలాగే, ప్రతి జీవకణంలో (Cell) 'డీఎన్ఏ' (DNA) ఉంటుంది. ఇందులో సమాచారం అపారమైన నిధి దాగి ఉంటుంది. ఇది జీవి నిర్మాణానికి సంబంధించిన ఒక సంపూర్ణ 'బ్లూప్రింట్' లాంటిది. ఒక పుస్తకం అనేది రచయిత లేకుండా ఎలాగైతే సాధ్యం కాదో, అలాగే డీఎన్ఏలోని ఈ అపార సమాచారం అంతా ఒక అత్యంత మేధావియైన సృష్టికర్త (Intelligent Creator) వైపునకే దారి తీస్తుంది. దీనిపై ఖురాన్ ఇలా అంటోంది:

భూమిలో ఎన్నో నిదర్శనాలు ఉన్నాయి, స్వయంగా మీలోనూ ఉన్నాయి. మీరు ఆలోచించరా??" (అజ్-జారియాత్: 21)

నక్షత్రాలలోని శక్తి ఒకరోజు పూర్తిగా హరించిపోతుందని, ఈ విశ్వం అంతా ఒకరోజు వినాశనానికి గురవుతుందని కూడా సైన్స్ చెబు తోంది. పవిత్ర ఖురాన్ కూడా 'ఖయామత్' (ప్రళయ దినం) నాడు ఆకాశాలు బద్దలవుతాయని, నక్షత్రాలు కాంతిహీనమై రాలి పోతాయని, పర్వతాలు దూది పింజల్లా ముక్కలైపోతాయని వివరంగా పేర్కొంది.

## పరలోక జీవితం (ఆఖిరత్) ఆవశ్యకత

పరలోక జీవితం ఎందుకు అవసరమో చెప్పడానికి ఖురాన్ ఎంతో హేతుబద్ధమైన, తార్కికమైన ఆధారాలను సమర్పించింది. మనిషి కోరికలు అనంతమైనవి, కానీ ఈ ప్రపంచం పరిమితమైనది. మనిషి ఎల్లప్పుడూ జీవించాలనుకుంటాడు, సంపూర్ణమైన న్యాయాన్ని ఆశిస్తాడు, శాశ్వతమైన ఆనందాన్ని కోరుకుంటాడు. కానీ ఈ భౌతిక ప్రపంచంలో ఇవన్నీ సాధ్యం కాదు. ఈ లోకంలో ఎంతోమంది దుర్మార్గులు, క్రూరులు ఎలాంటి శిక్ష పడకుండా తప్పించుకుంటున్నారు; అలాగే ఎంతోమంది బాధితులు న్యాయం దక్కకుండానే కన్నుమూస్తున్నారు. అందువల్ల, ఒకరోజు అందరికీ సంపూర్ణ న్యాయం జరిగే ఒక తీర్పు దినం ఖచ్చితంగా ఉండాలని మానవ నైజం (ఆత్మ) ఘోషిస్తోంది. పరలోకానికి సంబంధించిన నైతిక ఆవశ్యకతకు ఇదే అతిపెద్ద నిదర్శనం.

ఖురాన్ ఇలా ప్రశ్నిస్తోంది: " మేము విధేయుల స్థితిని అపరాధుల స్థితి మాదిరిగా చేస్తామా? ఏమయింది మీకు, ఇలాంటి నిర్ణయాలు చేస్తారు? (అల్-ఖలమ్: 35, 36)

ఈ అద్భుతమైన విశ్వాన్ని మొదటిసారి సృష్టించడం సాధ్యమై నప్పుడు, దానిని రెండవసారి పునఃసృష్టించడం (మరణానంతరం మళ్లీ బ్రతికించడం) ఎందుకు అసాధ్యం అవుతుంది? దీనిపై ఖురాన్ ఇలా సమాధానమిచ్చింది:

"మొదట వాటిని సృష్టించిన వాడే మళ్లీ వాటికి జీవం పోస్తాడు." (యాసీన్: 79)

సైన్స్ అనేది కేవలం ప్రకృతి నియమాలను (Laws of Nature) మనకు తెలియజేసే ఒక విజ్ఞానం. దాని ఉపయోగం అనేది పూర్తిగా మనిషి నైతికత, విశ్వాసం (ఈమాన్) పైనే ఆధారపడి ఉంటుంది. ఒకవేళ సైన్సును దైవభీతి, ఉన్నతమైన నైతిక విలువలు, సద్భావనతో ఉపయోగిస్తే, అది మానవాళికి ఒక గొప్ప 'వరప్రసాదం' (రహ్మత్) అవుతుంది. కానీ, అదే సైన్స్ & టెక్నాలజీల నుండి నైతికతను వేరు చేస్తే... అది అణుబాంబులు, జీవాయుధాలు (Biological Weapons) ప్రపంచ సర్వనాశనా నికి దారితీసే ఒక 'శాపం'గా మారుతుంది.

జ్ఞానం అనేది మనిషిని సృష్టికర్తకు మరింత దగ్గర చేయాలే తప్ప, ఆయన ఉనికిని నిరసించేలా చేయకూడదనే పాఠాన్ని పవిత్ర ఖురాన్ మానవాళికి ఇలా నేర్పుతోంది:

"యథార్థమేమిటంటే, అల్లాహ్ దాసులలో జ్ఞానులు మాత్రమే ఆయనకు భయపడతారు." (సూరహ్ ఫాతిర్: 28)

మానవుడు తన మేధస్సును, సైన్సును అల్లాహ్‌ను గుర్తించడానికి, మానవత్వానికి సేవ చేయడానికి, పరలోక సాఫల్యాన్ని సాధించ డానికి ఒక సాధనంగా ఉపయోగించడంలోనే నిజమైన విజయం దాగి ఉంది.

**(మిగతా వచ్చేవారం)**



# కర్బలా మహా సంగ్రామం

**నసీరా బేగం**

**ధర్మానికి** హాని కలిగి, అధర్మానికి పట్టాభిషేకం జరుగు తున్నప్పుడు ధర్మజ్ఞానులూ, భయభక్తులు కలవారూ చూస్తూ ఊరుకోరు. తమ శక్తివంచన లేకుండా దానిని అడ్డుకోవడానికి గట్టి ప్రయత్నం చేస్తారు. శత్రువు బలవంతుడైనా, సంపన్ను డైనా వారు భయపడరు. అవసరమైతే ప్రాణాలొడ్డి పోరాడు తారు, తమ సర్వస్వాన్నీ త్యాగం చేస్తారు. వారికి తమ శక్తియుక్తుల కంటే దైవం మీద, దైవ సహాయం మీదే నమ్మకం ఎక్కువ. తల పగిలి ముక్కలు ముక్కలైనా సరే, పర్వతం లాంటి శత్రువునైనా ఢీకొంటారు. అటువంటి వారి సంఖ్య సమాజంలో చాలా తక్కువ గానే ఉంటుంది. కానీ, వారి జీవితాలు ఆచంద్రతారార్కం ఆదర్శ ప్రాయంగా నిలిచి పోతాయి.

ఇస్లాం ధర్మంలో రాచరిక వ్యవస్థ లేదు. అధికారం అనేది ఎంతమాత్రం వారసత్వపు హక్కు కాదు. "తండ్రి రాజైతే కొడుకు కూడా రాజే కావాలి" అనే సిద్ధాంతం ఇస్లాంకు పూర్తిగా వ్యతిరేకం. పాలకుణ్ణి ప్రజలే ఎన్నుకుంటారు. ఎవడైతే దైవానికి ఎక్కువగా భయపడతాడో, వాడే పాలకుడిగా ఎన్నుకోబడాలి. రాజు చనిపోతూ తన కుమారుణ్ణి యువరాజుగా నియమించి పోయే అనువంశిక విధానాన్ని ఇస్లాం ఖండిస్తుంది.

ఈ విషయంలోనే 14 శతాబ్దాల క్రితం ఇస్లాం చరిత్రలో ఒక పెద్ద పొరపాటు జరిగింది. ఖలీఫాగా దేశాన్ని పాలిస్తున్న హజ్రత్ మావియా (ర) తన కుమారుడైన యజీద్‌ను యువరాజుగా ప్రకటించారు. ధర్మజ్ఞానం బాగా తెలిసినవారే అయినప్పటికీ, ఆయన ఈ ఘోరమైన పొరపాటుకు పాల్పడ్డారు. ఖలీఫా ఎన్నికను ప్రజలకు అప్పగించకుండా, తానే స్వయంగా తన కొడుకును ఖలీఫాగా, రాజుగా నియమించారు. ఇది ధర్మం పట్ల ఆయన చేసిన పెద్ద అపచారం. బహుశా పుత్రప్రేమ అలా చేయమని ఆయన్ని ప్రేరేపించిందేమో! ధర్మ శాస్త్రవేత్తలూ, మహాప్రవక్త (స) గారి ప్రత్యక్ష అనుచరులైన ఇంకా చాలా మంది పెద్దలు దీనిని తప్పుబట్టారు. ఇది ఖురాన్ గ్రంథానికి వ్యతిరేకమని, దైవప్రవక్త (స) గారి సంప్రదాయాలకు పూర్తిగా విరుద్ధమని, రాచరిక వ్యవస్థకు అంకురార్పణమని వారు విమర్శించారు. ఈ వార్త మొత్తం అరేబియా దేశంలో దావానలంలా వ్యాపించింది. ఖలీఫాగా యజీద్ నియామకాన్ని ప్రతిఘటించిన వారిలో హజ్రత్ ఇమామ్ హుసైన్ ప్రప్రథములు.

చివరి దైవప్రవక్త ముహమ్మద్ (స) గారి అనుంగు మనవడు, హజ్రత్ అలీ - ఫాతిమాల ప్రియకుమారుడైన హజ్రత్ హుసైన్ (ర), యజీద్‌ను రాజుగానూ, ఖలీఫాగానూ ఒప్పుకోలేదు. అతని పట్ల 'బైత్' చేయలేదు (విధేయత ప్రకటించలేదు). అతని నియామకం ధర్మశాస్త్ర విరుద్ధమైనదని బాహాటంగా ప్రకటిం

చారు. అతనికి వ్యతిరేకంగా తిరుగుబాటు బావుటాను ఎగురవేశారు. హజ్రత్ హుసైన్ ధర్మశాస్త్రాన్ని లోతుగా చదివి, అవగతం చేసుకున్నవారు. ధర్మానికి ఇంత పెద్ద అపచారం జరిగిందని ఆయన వాపోయారు. ఇంత పెద్ద ఘోరం జరుగుతున్నప్పుడు చూస్తూ ఊరుకుంటే దేవుడు క్షమించడని, చెడును ఏదో ఒక విధంగా అడ్డుకోవాలని ఆయన తలపోశారు. ఆ సమయంలో మహాప్రవక్త (స) గారి ఒక ఉపదేశం ఆయనకు జ్ఞాపకం వచ్చింది: "ముస్లిములారా! మీరు గనక చెడును చూస్తే, ధైర్యముంటే దానిని చేత్తో ఆపండి. అంత ధైర్యం లేకపోతే ఆ చెడును నోటితోనైనా ఖండించండి. నోటితో కూడా ఆపే ధైర్యం మీకు లేకపోతే, అది చెడు అని కనీసం మనసులోనైనా భావించండి. చెడును చూసి ఈ భావన, ఈ స్పందన కూడా మీలో కలగకపోతే మీరు ముస్లిములు కారు, మీలో ఇస్లాం లేదు."

దైవప్రవక్త(స) గారి ఈ అమరసూక్తి ప్రేరణతో ఆయన ముందుకు కదిలారు. క్రమంగా పండితులూ, పామరులూ చాలామంది ఆయన్ని సమర్థించసాగారు. ముఖ్యంగా కూఫా నగరానికి చెందిన ప్రజలు ఆయన పట్ల అపారమైన గౌరవ మర్యాదలను కనబరిచారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ మదీనా పట్టణంలో ఉన్న హజ్రత్ హుసైన్ గారికి ఎన్నో ఉత్తరాలు రాశారు. ఆయన గనక కూఫా నగరానికి వస్తే, తాము ఆయన్ని ఖలీఫాగా ఎన్నుకుంటామని, ఆయన చేపట్టిన ఉద్యమాన్ని మనసా వాచా కర్మణా సమర్థిస్తామని వాగ్దానం చేశారు. వారు చూపిన ఈ ఆప్యాయతకూ, విధేయతకూ హజ్రత్ హుసైన్ ముగ్ధులయ్యారు. వారి అభీష్టం ప్రకారం కూఫా నగరానికి వెళ్ళి, అక్కడే ఉద్యమ వ్యూహాల గురించి చర్చిద్దామని ఆయన నిశ్చయించుకున్నారు.

హజ్రత్ హుసైన్ (ర) కూఫా నగరానికి ప్రయాణమయ్యారు. ఇది కేవలం ధర్మరక్షణార్థమే కానీ, ఖలీఫా పదవి కోసమో, అధికార తృష్ణతోనో కాదు. ధర్మ సూత్రాలను తుంగలో తొక్కి యజీద్‌ను రాజుగా నియమించడం వల్లనే... ఈ అన్యాయాన్ని, అక్రమాన్ని ఎదిరించడానికి ఆయన ఈ సాహసానికి పూనుకున్నారు. లేకపోతే ఆయన తన భార్యాపిల్లలతో, కుటుంబసభ్యులతో, దాయాదులతో మాత్రమే కూఫా నగరానికి ఎందుకు బయలుదేరుతారు? అందరూ కలిసి ఆ బృందంలో కేవలం 72 మంది మాత్రమే ఉన్నారు. ఇది మహా సైన్యమా? లేదా సైనిక దండయాత్రనా? అధర్మాన్ని చేత్తో అణిచివేద్దామనే తపనే ఆయన్ని ఈ మహత్కార్యానికి పురికొల్పింది.

కానీ, దుష్టుడైన యజీద్ దీనిని ఒక పెద్ద తిరుగుబాటుగా భావించాడు. పసిపిల్లలు, మహిళలు, చెప్పుకోదగ్గ ఆయుధాలు లేని పురుషులు ఉన్నటువంటి ఈ చిరుసైన్యాన్ని అణచ డానికి సుశిక్షితులైన, సాయుధులైన నాలుగు వేల మంది సైనికులను ఉమర్ బిన్ సాద్ అనే సైన్యాధిపతి నాయ కత్వంలో పంపాడు. యజీద్ సైన్యం హజ్రత్ హుసైన్‌ను, ఆయన మనుషులనూ కర్బలా మైదానం వద్ద నిర్బం ధించింది. ఎటూ వెళ్లకుండా నలువైపుల నుండి దిగ్బంధం చేసింది. అక్కడ హోరాహోరీగా యుద్ధం జరిగింది. రక్తం ఏరులై పారింది. హజ్రత్ హుసైన్ గారి సహచరులందరూ నేలకొరిగారు, అమరగతిని పొందారు.

ఇక యుద్ధ మైదానంలో హజ్రత్ హుసైన్ చివరకు తీవ్రమైన గాయాలతో నేలకొరిగారు. అప్పుడు క్రూర సైనికులు ఆయన శిరస్సును ఖండించి, శరీరం నుండి వేరు చేశారు. ఆయన శరీరంపై ఉన్న వస్తువులను, వస్త్రాలను దోచుకున్నారు. ఆయన మృతదేహాన్ని గుర్రాలతో తొక్కించారు. ఆ తర్వాత మహిళలు తలదాచుకున్న శిబిరాన్ని సైతం సైనికులు దోచుకున్నారు. స్త్రీల శరీరాలపై ఉన్న దుప్పట్లను తొలగించారు. అమరవీరుల శిరస్సులను ఖండించి, వాటిని హజ్రత్ హుసైన్ గారి శిరస్సుతో పాటు కూఫా నగరానికి తీసుకువెళ్ళారు. దుర్మార్గుడైన కూఫా గవర్నర్ ఇబ్నె జియాద్ ఆ శిరస్సుల బహిరంగ ప్రదర్శనను ఏర్పాటు చేశాడు.

ఇంతటి పెద్ద ఘాతుకం కర్బలా మైదానంలో, మొహర్రం 10వ తేదీన, దాదాపు 1400 సంవత్సరాల క్రితం జరిగింది. ఈ పోరాటం జరిగింది ధర్మాధర్మాలకు మధ్య, న్యాయాన్యాయాలకు మధ్య. అధర్మాన్ని ఎదిరించినవారు తమ బలం ఎంతో, తమ సామర్థ్యం (బిసాతు) ఎంతో బేరీజు వేసుకోలేదు. వారు దేవుణ్ణి నమ్ముకున్నారు, ఆయనపైనే భారం వేశారు. వారి సంఖ్య చిన్నదైనా వారు చేసిన త్యాగం చాలా పెద్దది. అది చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. ఆ త్యాగం వల్లే ధర్మం బతికింది, ఇప్పటికీ బతుకుతోంది.






## తెలంగాణలో కిడ్నీ వ్యాధుల తీవ్రత

న్యూ ఢిల్లీలోని 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లివర్ అండ్ బిలియరీ సైన్సెస్' (ILBS) పరిశోధకులు ఇండియన్ జర్నల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ లో ప్రచురించిన ఒక అధ్యయనం ప్రకారం, భారతదేశంలోనే క్రానిక్ కిడ్నీ డిసీజ్ (CKD - దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధి) కారణంగా అత్యధిక మరణాల రేటు నమోదైన రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. 2023 సంవత్సరంలో తెలంగాణలో ప్రతి లక్ష జనాభాకు 19.84 మంది ఈ కిడ్నీ వ్యాధి కారణంగా మరణించినట్లు ఈ అధ్యయనంలో తేలింది. కొత్తగా నమోదవుతున్న కిడ్నీ వ్యాధి కేసుల సంఖ్యలో తెలంగాణ మొదటి స్థానంలో లేనప్పటికీ, మరణాల రేటులో మాత్రం దేశంలోనే అగ్రస్థానంలో ఉంది. ఈ అధ్యయనం వెల్లడించిన గణాంకాల ప్రకారం, తెలంగాణలో ప్రతి లక్ష మంది జనాభాకు కొత్తగా 241.57 కిడ్నీ వ్యాధి కేసులు నమోదవుతున్నాయి. కాగా, హర్యానా రాష్ట్రం ప్రతి లక్ష జనాభాకు 316.35 కేసులతో దేశంలోనే అత్యధిక కొత్త కేసుల నమోదులో మొదటి స్థానంలో ఉంది. తెలంగాణతో పాటు పంజాబ్, ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్, గోవా రాష్ట్రాల్లో కూడా కిడ్నీ వ్యాధి మరణాల రేటు ఎక్కువగా ఉన్నట్లు ఈ నివేదిక పేర్కొంది. హైదరాబాద్‌లోని నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (NIMS) వైద్యులు చెబుతున్న దాని ప్రకారం, అక్కడ ప్రతి నెలా సుమారు 500 నుండి 600 మంది వరకు కొత్త కిడ్నీ రోగులు చికిత్స కోసం వస్తున్నారు. రాష్ట్రంలో సంభవించిన మొత్తం కిడ్నీ వ్యాధి మరణాలలో దాదాపు నాల్గవ వంతు (1/4 వంతు) మరణాలు డయాబెటిస్ వల్లే జరిగాయి. దీనితో పాటు అధిక రక్తపోటు (హై బ్లడ్ ప్రెజర్) కూడా ఈ వ్యాధి తీవ్రతకు మరో ముఖ్య కారణమని వైద్యులు గుర్తించారు.

## ఏపీసీఆర్ ఆధ్వర్యంలో పారా లీగల్ వాలంటీర్ల శిక్షణ

సామాన్యులకు న్యాయ రక్షణ, చట్టాలపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా 'అసోసియేషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్ (APCR) తెలంగాణ చాప్టర్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయి పారా లీగల్ వాలంటీర్ల శిక్షణా క్యాంప్ నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి దాదాపు 75 మందికి పైగా న్యాయ నిపుణులు, సామాజిక కార్యకర్తలు ఈ శిక్షణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీసీఆర్ ప్రతినిధులు మాట్లాడుతూ, హక్కుల ఉల్లంఘన జరిగినప్పుడు తక్షణమే స్పందించే వికేంద్రీకృత న్యాయ సహాయ వ్యవస్థల అవసరాన్ని నొక్కి చెప్పారు. క్యాంప్‌లో భాగంగా అరెస్టుల సమయంలో నిందితుల హక్కులు (UAPA చట్టం), జీరో ఎఫ్ఐఆర్ నమోదు విధానం, క్షేత్రస్థాయిలో వాస్తవాల సేకరణ (Fact-Finding), ఓటు హక్కు సవరణల వంటి కీలక అంశాలపై న్యాయ నిపుణులు ప్రాక్టికల్ అవగాహన కల్పించారు. సున్నితమైన కేసుల పర్యవేక్షణకు డిజిటల్ ట్రాకింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, మారుమూల ప్రాంతాల్లో మరిన్ని న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించాలని కార్యకర్తలు తీర్మానించారు. చట్టం పట్ల భయం కాదు, అవగాహనే సమాజానికి రక్షణ అని చాటిచెప్పిన ఈ కార్యక్రమం అట్టడుగు వర్గాలకు ఎంతగానో దోహదపడుతుందని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## దగ్గు మందులకు డాక్టర్ ప్రిస్క్రిప్షన్ తప్పనిసరి

దగ్గు మందుల (సిరప్‌ల) నాణ్యత, దుర్వినియోగంపై పెరుగుతున్న ఆందోళనల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై గుర్తింపు పొందిన వైద్యుడి ప్రిస్క్రిప్షన్ (చిట్టీ) ఉంటేనే ఫార్మసీలలో దగ్గు మందులను విక్రయించాలని స్పష్టం చేస్తూ 'డ్రగ్స్ రూల్స్-1945'లో సవరణలు చేసింది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ నోటిఫికేషన్ విడుదల చేస్తూ.. కేవలం లైసెన్స్ ఉన్న ఔషధ దుకాణాల్లో మాత్రమే వీటిని అమ్మాలని ఆదేశించింది.

## బుల్డోజర్ సంస్కృతిపై జమాఅతె ఇస్లామీ హింద్ ఆగ్రహం



దేశంలో చట్టబద్ధ పాలనను, రాజ్యాంగ స్ఫూర్తిని అపహాస్యం చేస్తూ సాగుతున్న అమానవీయ 'బుల్డోజర్ రాజకీయాన్ని' తక్షణమే నిలిపివేయాలని జమాఅతె ఇస్లామీ హింద్ (జె.ఐ.హెచ్) డిమాండ్ చేసింది. ఢిల్లీలోని కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సంస్థ ఉపాధ్యక్షులు మలిక్ మోతసిమ్ ఖాన్ మాట్లాడుతూ.. ఎటువంటి ముందస్తు నోటీసులు లేకుండా, పునరావాసం కల్పించకుండా కేవలం కక్షసాధింపు ధోరణితో జరుపుతున్న అక్రమ కూల్చివేతలు పౌర సమాజానికి గొడ్డలిపెట్టుగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఢిల్లీ, సూరత్, జైపూర్, వారణాసి, పింప్రించింఛ్వాడ్ వంటి నగరాల్లో ఇళ్లు, మతపరమైన కట్టడాలను కూల్చివేస్తూ పాలకుల దురహంకారాన్ని ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. సుప్రీంకోర్టు తీర్పులను సైతం ఖాతరు చేయకుండా సాగుతున్న ఈ 'బుల్డోజర్ సంస్కృతి' ముమ్మాటికీ మానవ హక్కుల ఉల్లంఘనేనని, పౌరులందరికీ గౌరవప్రదమైన జీవన హక్కును కల్పించాల్సిన బాధ్యతను ప్రభుత్వం విస్మరించరాదని వారు స్పష్టం చేశారు.

## 16 ఏళ్లలోపు పిల్లలపై సోషల్ మీడియా నిషేధానికి బ్రిటన్ మొగ్గు

ఆస్ట్రేలియా బాటలోనే బ్రిటన్ ప్రభుత్వం కూడా పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సోషల్ మీడియా వినియోగంపై కఠిన ఆంక్షలు విధించేందుకు సిద్ధమవుతోంది. 16 ఏళ్లలోపు వయసున్న పిల్లలు సామాజిక మాధ్యమాలను ఉపయోగించకుండా పూర్తిగా నిషేధించాలని బ్రిటన్ యోచిస్తోంది. చిన్న వయసులోనే పిల్లలు సోషల్ మీడియాకు బానిసలవుతుండటం, తద్వారా సైబర్ వేధింపులకు గురవుతూ తీవ్ర మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటుండటంతో వారిని రక్షించేందుకు ఈ నిర్ణయం తీసుకోనున్నారు. ఈ నిబంధనలను ఉల్లంఘించే సాంకేతిక సంస్థలపై భారీ జరిమానాలు విధించడంతో పాటు, వయస్సు నిర్ధారణ ప్రక్రియను (Age Verification) మరింత పటిష్టం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

## ఈరాన్ ఫుట్‌బాల్ ఆటగాళ్ల '168' బ్యాడ్జీల కలకలం

ఫిఫా ప్రపంచకప్ టోర్నీ కోసం మెక్సికోలోని టిజువానా చేరుకున్న ఈరాన్ ఫుట్‌బాల్ జట్టు ఆటగాళ్లు తమ సూట్‌లపై '168' అని ఉన్న బ్యాడ్జీలను ధరించి కొత్త వివాదానికి తెరలేపారు. అమెరికా-ఈరాన్ సైనిక ఘర్షణల తొలి రోజున ఒక ప్రాథమిక పాఠశాలపై జరిగిన దాడిలో మరణించిన 168 మంది చిన్నారుల జ్ఞాపకార్థం ఈరాన్ విదేశాంగ శాఖ ఈ హ్యాష్‌ట్యాగ్‌ను రూపొందించింది. క్రీడా వేదికలపై రాజకీయ, మతపరమైన ప్రదర్శనలను ఫిఫా నిబంధనలు తీవ్రంగా నిషేధించినప్పటికీ, మైదానం వెలుపల ప్రయాణ సమయంలో వీటిని ధరించడం నియమావళిలోని 'గ్రే ఏరియా' (స్పష్టత లేని విభాగం) కిందికి వస్తుందని నిపుణులు చెప్తున్నారు. ఈరాన్ జట్టు ఇలాంటి చిహ్నాలను ప్రదర్శించడం ఇది మొదటిసారి కాదు; ఈ ఏడాది మార్చిలో జరిగిన స్నేహపూర్వక మ్యాచ్‌ల సమయంలోనూ జాతీయ గీతం వేళ స్కూల్ బ్యాగులను పైకి లేపడం, బాంబు దాడుల్లో మరణించిన పౌరుల చిత్రాలను ప్రదర్శించడం ద్వారా వారు తమ నిరసనను వ్యక్తం చేశారు.

## డీర్‌బోర్న్‌లో 'కన్నీళ్ల గోడ'.. గాజా మృతులకు కళాత్మక నివాళి

గాజా యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన వేలాది మంది పాలస్తీనా చిన్నారుల స్మారకార్థం అమెరికాలోని మిచిగన్ రాష్ట్రం, డీర్‌బోర్న్ నగరంలో ఏర్పాటు చేసిన 'వాల్ ఆఫ్ టియర్స్' (కన్నీళ్ల గోడ) బహిరంగ ప్రదర్శన సందర్శకులను కదలిస్తోంది. స్థానిక పీస్ పార్క్ ఈస్ట్‌లో ఏర్పాటు చేసిన 100 అడుగుల ఈ భారీ ద్విభాషా (అరబిక్, ఇంగ్లీష్) గోడపై అక్టోబర్ 2023 నుండి మరణించిన 18,457 మంది పిల్లల పేర్లు, వయసు, వారి నేపథ్యాలను పొందుపరిచారు. ప్రముఖ సామాజిక కళాకారుడు ఫిల్ బ్యూప్లర్ దీనిని రూపొందించారు. యుద్ధ బాధితులను కేవలం అంకెలుగా కాకుండా, వారి కథలను ప్రపంచానికి వివరించి మానవీయ కోణాన్ని చాటడమే ఈ ప్రదర్శన ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. గాజాలో మొత్తం చిన్నారుల మరణాలు 75,000 దాటి ఉండవచ్చని వారు ఆందోళన వ్యక్తం చేశారు. డీర్‌బోర్న్ మేయర్ అబ్దుల్లా హమ్మూద్ ఈ ప్రదర్శనను ప్రారంభించి, కళాకారుడిని సత్కరించారు. ఇది కేవలం స్మారకం మాత్రమే కాదని, యుద్ధం సృష్టిస్తున్న మానవతా సంక్షోభంపై ప్రపంచ దేశాల అంతరాత్మను మేల్కొలిపే పిలుపు అని ఆయన పేర్కొన్నారు. జూలై 31 వరకు కొనసాగే ఈ ప్రదర్శనను సందర్శించాలని శాంతి కాముకులకు అరబ్- అమెరికన్ హక్కుల కమిటీ (AHRC) పిలుపునిచ్చింది. గతంలో లండన్, న్యూయార్క్, శాన్ ఫ్రాన్సిస్కోలలో ప్రదర్శితమైన ఈ 'కన్నీళ్ల గోడ' త్వరలో మెక్సికో సిటీ, డల్లాస్ నగరాలకు తరలనుంది.

## గాజాలో 73 వేలు దాటిన పాలస్తీనియన్ల మరణాలు



ఇజ్రాయిల్ - హమాస్ మధ్య సుదీర్ఘంగా కొనసాగుతున్న భీకర యుద్ధం కారణంగా గాజా స్ట్రిప్‌లో మానవ నష్టం తీవ్ర రూపం దాల్చింది. నిరంతర దాడుల ఫలితంగా ఇప్పటివరకు మరణించిన పాలస్తీనియన్ల సంఖ్య 73,000 మార్కును దాటిపోయింది. ఈ దాడుల్లో లక్షలాది మంది తీవ్రంగా గాయపడగా, మృతుల్లో అత్యధికంగా మహిళలు, చిన్న పిల్లలే ఉన్నట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. ఆహారం, మందులు వంటి కనీస నిత్యావసరాల కొరతతో గాజాలో మానవతా సంక్షోభం మరింత ముదిరినప్పటికీ, అంతర్జాతీయ సమాజం చేస్తున్న శాంతి విజ్ఞప్తులను లెక్కచేయకుండా అక్కడ ఘర్షణలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి.




**- డాక్టర్ ముహమ్మద్ అజీముద్దీన్**

**నాడు అక్షరం సమాజానికి ఆయుధమైంది. నేడు అక్షరమే సమాజాన్ని ముక్కలు చేసే ఆయుధంగా మారుతోంది.** సాంకేతికత చేతిలో ఇమిడిపోయిన ఆధునిక యుగంలో, మానవ మేధస్సును బందీని చేస్తున్న అతిపెద్ద డిజిటల్ లాబొరేటరీ– 'వాట్సాప్ విశ్వ విద్యాలయం'. ఏ చట్టబద్ధమైన గుర్తింపు లేని, ఇటుకల గోడలు లేని, ఫీజుల క్యూలు కనపడని ఈ వింత పాఠశాల నేడు దేశంలో అత్యంత శక్తివంతమైన ప్రొపగండా (దుష్ప్రచారం) సామ్రాజ్యంగా అవతరించింది. ప్రతిరోజూ కోట్లాది మంది మేధస్సుకు ఈ వేదిక ద్వారానే అబద్ధాల విషాన్ని నూరిపోస్తున్నారు. సత్యం గడప దాటేలోపు అబద్ధం ప్రపంచాన్ని చుట్టేస్తుందన్న సామెతను నిజం చేస్తూ, ఇక్కడ ఒక అబద్ధాన్ని వేలసార్లు ఫార్వార్డ్ చేసి, అదే పరమసత్యమనే భ్రమను కల్పిస్తున్నారు. చివరకు, ఈ అబద్ధాన్ని ప్రశ్నించిన వాడే దేశద్రోహిగా ముద్రపడేంతటి ప్రమాదకర వాతావరణం నేడు సమాజంలో నెలకొంది.

ఇటీవలే అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సైతం ఒక విచారణ సందర్భంగా– 'వాట్సాప్ యూనివర్సిటీ ద్వారా పొందే జ్ఞానానికి ఎలాంటి చట్టపరమైన, నైతిక గుర్తింపు లేదు' అని కుండబద్దలు కొట్టింది. కానీ, ఈ అబద్ధాల కర్మాగారాల నిర్వాహకులు న్యాయ స్థానాల హెచ్చరికలను బేఖాతరు చేస్తూ, తమ విభజన రాజకీయాల 'కోర్సులను' దిగ్విజయంగా నడిపిస్తున్నారు.

ఈ డిజిటల్ మాయాజాలం పనితీరు అత్యంత సూక్ష్మమైనది, అంతే భయంకరమైనది. ఇది పెద్ద పెద్ద స్టూడియోల నుండి కాకుండా, మన జేబుల్లోని మొబైల్ స్క్రీన్ల ద్వారా మన ఆలోచనా సరళిని నియంత్రిస్తోంది. మనకు అత్యంత ఆప్తులు, బంధువులు పంపే సందేశం కావడం వల్ల మన మెదడులోని 'నిజనిర్ధారణ' చేసే విచక్షణ శక్తి నిలిచిపోతుంది. 'మనవాడే పంపాడుగా, నిజమే అయ్యుంటుంది' అనే గుడ్డి నమ్మకమే ఈ ప్రొపగండాకు ఇంధనంగా మారుతోంది.

డిజిటల్ ప్రపంచంలో సమాచార దాడి మూడు రూపాల్లో విరుచుకు పడుతోంది. మొదటిది 'మిస్–ఇన్ఫర్మేషన్'– అవగాహన లేక పొరపాటున తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయడం. రెండవది అత్యంత ప్రమాదకరమైన 'డిస్–ఇన్ఫర్మేషన్'– ఎన్నికల సమయం లోనో, రాజకీయ ప్రయోజనాల కోసమో ప్రత్యర్థులపై బురద చల్లుతూ, మార్ఫింగ్ వీడియోలతో ఉద్దేశపూర్వకంగా అబద్ధాలను సృష్టించడం. ఇక మూడవది 'మాల్–ఇన్ఫర్మేషన్'– ఎక్కడో పదేళ్ల క్రితం జరిగిన గొడవల వీడియోలను నేటి సందర్భానికి ముడిపెట్టి, సమాజంలో మత విద్వేషాల మంటలు రేపడం.

ఈ మొత్తం వ్యవహారం వెనుక 'అటెన్షన్ ఎకానమీ' (శ్రద్ధ ఆధారిత ఆర్థిక వ్యవస్థ) అనే ఒక నిరంకుశ వ్యాపార సూత్రం దాగి ఉంది. యూజర్ల కోపం, భయం, అసహ్యం వంటి తీవ్రమైన భావోద్వేగాలను రేకెత్తించడం ద్వారానే ఈ సామాజిక మాధ్యమాలు మనుగడ సాగిస్తున్నాయి. బ్రిటీష్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ (BBC) విశ్లేషించినట్లు– మనుషులు ఆవేశంలో ఉన్నప్పుడే ఎక్కువ సమయం స్క్రీన్లకు అతుక్కుపోతారు. ఈ స్క్రీన్ టైమ్ పెరిగే కొద్దీ సదరు డిజిటల్ దిగ్గజాల ఖాతాల్లోకి ప్రకటనల ద్వారా బిలియన్ల కొద్దీ డాలర్ల లాభాలు వచ్చి పడతాయి. నైతికత విభాగం ఎప్పుడూ నష్టాల్లోనే ఉంటుంది, కానీ సంచలనం సృష్టించే వ్యాపారం మాత్రం లాభాల పీఠంపై కూర్చుంటుంది అనడానికి ఇదే నిదర్శనం.

కానీ, ఈ అల్గారిథమ్స్ సంపాదిస్తున్న లాభాలకు మన సమాజం చెల్లిస్తున్న మూల్యం ఎంత? పుకార్ల కారణంగా బెంగళూరులో అమాయక వలస కార్మికుడు మూక దాడిలో ప్రాణాలు కోల్పోవడం, త్రిపురలో పుకార్లను అణచడానికి ఇంటర్నెట్ సేవలను పూర్తిగా నిలిపివేయాల్సి రావడం– ఈ డిజిటల్ వ్యాధి తీవ్రతకు అద్దం పడు తున్నాయి.

కథ ఇక్కడితో ముగిసిపోదు. ఈ విశ్వవిద్యాలయం కేవలం మీ ఆలోచనలనే మార్చడం లేదు, మిమ్మల్ని ఒక నిర్దిష్ట రాజకీయ అజెండా వైపు నడిపిస్తోంది. సార్వత్రిక ఎన్నికల్లో ఇవే సామాజిక మాధ్యమాలు ప్రధాన ఎన్నికల ఆయుధాలుగా మారాయి. కోట్లాది వాట్సాప్ గ్రూపుల ద్వారా దేశాన్ని పట్టి పీడిస్తున్న నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, ఆర్థిక వ్యవస్థ, ప్రజాస్వామ్య విలువల వంటి ప్రాథమిక సమస్యలను తెరమరుగు చేసి, ఓటర్లను కేవలం 'మతపరమైన గుర్తింపు', 'భవిష్యత్తుపై భయం' అనే భావనల వైపు మళ్లించడంలో ఈ శక్తులు విజయం సాధిస్తున్నాయి.

ఒక సాధారణ పౌరుడు తన జీవనోపాధిని, హక్కులను, నిత్యజీవిత సమస్యలను విస్మరించి, కేవలం ఎదుటివాడి కులం, మతం వైపు ద్వేషంతో చూడటం మొదలుపెట్టడమే ఈ డిజిటల్ లాబొరేటరీ సాధించిన అసలైన విజయం. సాంకేతికత మానవ వికాసానికి తోడ్పడాలి కానీ, వినాశనానికి దారితీయకూడదు. అబద్ధాల వేగానికి అడ్డుకట్ట వేయవలసిన బాధ్యత కేవలం చట్టాలదే కాదు; వస్తున్న ప్రతి సందేశాన్ని విజ్ఞతతో, విమర్శనాత్మక దృష్టితో పరిశీలించాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపైనా ఉంది. అప్పుడే ఈ వాట్సాప్ విశ్వవిద్యాలయాల మాయాజాలం నుండి సమాజానికి విముక్తి లభిస్తుంది. ❖

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2026-2028 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**